10 మంది పక్కింటోళ్లు పర్మిషనిస్తేనే..



శునకాలు పెంచుకోవడానికి నిబంధనలు పెట్టిన సూరత్ 2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - ఆదివారం 6 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:190 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## వరి నాట్లేసిన సీఎం



హుడ్కియా బాల్‌లో భాగంగా భూమి, నీరు, మేఘాలకు పూజలు 2

# మూడేళ్లలో అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తి



**అమరావతి:** రాజధాని అమరావతిలో స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం కోసమే 10వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ అన్నారు. భూ సేకరణ వల్ల రైతులు నష్టపోతారనే ఉద్దేశంతోనే భూ సమీకరణకు వెళ్తున్నట్లు తెలిపారు. అమరావతి రెండో దశ భూ సమీకరణకు ఇప్పటికే 7 గ్రామాల పరిధిలో 20 వేల ఎకరాలు ఇచ్చేందుకు రైతులు సమ్మతించినట్లు తెలిపారు. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన సీఆర్‌డీఏ 50వ అథారిటీ సమావేశంలో 7 అంశాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వెల్లడించారు.

స్మార్ట్ ఇండస్ట్రీస్, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు మరో 2,500 ఎకరాల చొప్పున కేటాయించేందుకు సీఎం అంగీకరించారని వివరించారు. అమరావతిలో 5 స్టార్ హోటళ్లకు అనుబంధంగా 10వేల మంది సామర్థ్యంతో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు అదనంగా 2.5 ఎకరాలు, 7,500 మంది సామర్థ్యంలో కన్వెన్షన్ సెంటర్ కట్టే సంస్థలకు మరో 2 ఎకరాలు ఇవ్వాలని నిర్ణయించారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన ఇసుకను కృష్ణా నదిలో తవ్వుకునేలా సీఆర్‌డీఏకు అనుమతులు మంజూరు చేశారు. ప్రణాళిక ప్రకారం వచ్చే మూడేళ్లలో రాజధాని అమరావతి తొలి దశ నిర్మాణం పూర్తవుతుందని నారాయణ స్పష్టం చేశారు.

### సీఆర్‌డీఏ నిర్ణయాలు

రాజధానిలో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్ సహా మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్ఎఫ్‌పీగా పిలిచేందుకు ఆమోదం

అమరావతిలో నిర్మించే ఫైవ్ స్టార్ హోటళ్ల సమీపంలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ ప్రతిపాదనకు అథారిటీ ఆమోదం

మందడం, తుళ్లూరు, లింగాయపాలెంలో 2.5 ఎకరాల చొప్పున నాలుగు చోట్ల కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి క్యూబీఎస్ ప్రాతిపదికన అమోదం

అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనుల కోసం ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టేషన్ ప్రక్రియ ద్వారా ఇసుక తవ్వుకునేందుకు అనుమతి

వచ్చే రెండేళ్లలో రాజధాని నిర్మాణానికి 159.54 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అంచనా

భూముల కేటాయింపులపై కేబినెట్ సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

సీబీఐ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఎంఎస్‌కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ, కిమ్స్ సహా 16 సంస్థలకు 65 ఎకరాల భూ కేటాయింపులకు ఆమోదం

రాజధానిలోని ఈ-15 రహదారిపై 6 లైన్ల ఆర్వోబీ నిర్మాణానికి ఆమోదం

పొట్టి శ్రీరాములు, అల్లూరి సీతారామరాజు స్మారక చిహ్నాలు ఏర్పాటుకు స్థలం కేటాయించేందుకు ఆమోదం.

## ఆ దేశ ప్రధాని బీహార్ ముద్దుబిడ్డే

సరయూ నది జలాలు, రామమందిర ప్రతిమను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమ్లాకు అందజేసిన మోడీ

మౌలిక సౌకర్యాలు, ఔషధ రంగాల్లో ఇరు దేశాల మధ్య ఆరు ఒప్పందాలు

సోహారీ ఆకులో భోజనం వడ్డన



**పోర్ట్ ఆఫ్ స్పెయిన్, జూలై 5:** అయోధ్యలోని సరయూ నది జలాలు, రామమందిరం ప్రతిమ, మహాకుంభ మేళా జలాలను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమ్లా పర్సాద్-బిసెసర్కు మోదీ అందజేశారు. ఆ దేశంలో పర్యటిస్తున్న మోడీ భారత సంతతి ప్రజలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ఆ దేశానికి బీహార్ రాష్ట్రంతో ఉన్న సంబంధాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రధాని కమ్లా పర్సాద్-బిసెసర్ పూర్వీకులు ఆ రాష్ట్రం నుంచే వచ్చారని గుర్తుచేశారు. భారతీయులు ఆమెను బీహార్ ముద్దుబిడ్డగా పరిగణిస్తుంటారని చెప్పారు. ఆ రాష్ట్ర వారసత్వం భారత్ కే కాకుండా యావత్ ప్రపంచానికి గర్వకారణమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోని అత్యంత గౌరవనీయ, దార్శనిక నాయకుల్లో మోడీ ఒకరంటూ కమ్లా పర్సాద్-బిసెసర్ భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు క్రిస్టైన్ కర్లా కంగలూ పూర్వీకులు తమిళనాడుకు చెందినవారే. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా మౌలిక, ఔషధ సహా వివిధ రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ట్రినిడాడ్ అండ్ టొబాగో-భారత్ ప్రధానులు ఆరు

...మిగతా 2లో

## ఐదేళ్లు అరాచకాలు చేసి.. ఇప్పుడు నీతులు చెబుతున్నారా?

### మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి:** వైకాపా ఖాళీ అవడం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైకాపా నాయకులు అధికారం కోల్పోవడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్లు అరాచకాలు చేసి, ప్రజలను పీడించుకొని తిని.. ఇవాళ నీతులు చెబుతున్నారని ధ్వజమెత్తారు. త్వరలో వైకాపా కార్యాలయానికి టూ-లెట్ బోర్డు పెట్టబోతున్నారని.. అందుకే ఆందోళనలో ఆ పార్టీ నాయకులు ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. బియ్యం కొట్టేసిన దొంగతో ప్రెస్ మీట్ పెట్టించడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. దొంగలతో ప్రయాణం చేస్తున్న జగన్ రెడ్డి.. పెద్ద దొంగ అని మంత్రి అన్నారు. సింగయ్య మతికి సంబంధించి విజువల్స్ అంతా క్లియర్‌గా ఉంటే తమకు ఎలాంటి సంబంధం లేదని జగన్ రెడ్డి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగయ్య మతితో ఎలాంటి సంబంధం లేనప్పుడు కుటుంబాన్ని ఎందుకు పరామర్శించారని మంత్రి ప్రశ్నించారు.

## పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



పీ4 తొలి సమావేశంలో రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్

పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు పక్కా ప్రణాళికలు

మార్గదర్శి - బంగారు కుటుంబాల ఎంపిక వేగవంతం

2029 నాటికి 100% అర్హులందరికీ ఇళ్ళులు

**కర్నూలు, జూలై 05మనం న్యూస్:** పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరపాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి స్వర్ణాంధ్ర-పీ4 (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్షిప్) తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర విజన్ -2047 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, మార్గదర్శి - బంగారు కుటుంబాల ఎంపిక అర్హతలు పక్కాగా పరిశీలించి

...మిగతా 2లో

## డాక్టర్ల సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ల సమస్య తీర్చిన ప్రభుత్వం

పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్...



2

## నకిలీ హెల్మెట్లపై కేంద్రం ఉక్కుపాదం

- నాణ్యతలేని శిరస్త్రాణాల తయారీ, అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు
- బీఐఎస్ సర్టిఫైడ్ హెల్మెట్లనే వాడాలని వినియోగదారులకు విజ్ఞప్తి



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారవుతున్న, అమ్ముడవుతున్న హెల్మెట్లపై ఉక్కుపాదం మోపింది. అటువంటి హెల్మెట్లను తయారుచేసే సంస్థలు, విక్రయించే రిటైలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఐఎస్ఐ మార్క్ ఉన్న, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) సర్టిఫికేషన్ పొందిన హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని ప్రజలకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. దేశంలో 21 కోట్లకు పైగా

...మిగతా 2లో

## చిన్నార్రుల కలల సాకారానికి అండగా నిలుస్తాం: మంత్రి లోకేశ్



**అమరావతి:** తమకు చదువు చెప్పించాలంటూ నెల్లూరు కమిషనర్‌కు ఇద్దరు చిన్నారులు విజ్ఞప్తి చేయడంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. చదువు కోసం కమిషనర్‌ను చిన్నారులు ప్రాధేయపడటం కలచివేసిందన్నారు. 'ఓ సారూ.. మాకూ చదువు చెబుతారా?' అంటూ ఇద్దరు చిన్నారులపై ఈటీవీ భారత్‌లో వచ్చిన కథనంపై నారా లోకేశ్ స్పందించారు. చిన్నారులు పెంచలయ్య, వెంకటేశ్వర్ల చదువుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పేదరికం నుంచి బయటకు తెచ్చే ఒకే ఒక్క సాధనం విద్య అని, చిన్నారులు తమ కలలను సాకారం చేసుకునేందుకు అండగా నిలుస్తామని అన్నారు.

## విస్తరిస్తున్న కృత్రిమ మేధ

భారతీయులు నైపుణ్యాలను పెంచుకోవాలె • సూచించిన 'ఏఐ ఫర్ ఆల్: బిల్డింగ్ ఆన్ ఏఐ-రెడీ వర్క్ ఫోర్స్ ఇన్ ఆసియా-పసిఫిక్' నివేదిక



**హైదరాబాద్, జూలై 5:** కృత్రిమ మేధ కొత్త పుంతలు తొక్కుతూ.. తయారీ, వ్యాపార నిర్వహణ, ఆరోగ్యం, విద్య, కస్టమర్ సర్వీసెస్ తదితర అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. భారత్ ఈ సాంకేతికతను వేగంగా అందిపుచ్చుకోవాల్సిన అవసరాన్ని ఓ నివేదిక చాటిచెప్పింది. ప్రపంచంలోనే అతిపెద్ద శ్రామిక శక్తిని కలిగి ఉన్న భారత్ అందుబాటులో ఉన్న ఏఐ నైపుణ్యాలను వారికి వెంటనే అందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. గూగుల్, ఆసియా డెవలప్మెంట్ బ్యాంకు (ఏడీబీ)ల సహకారంతో ఏవీపీఎన్ అనే సంస్థ 'ఏఐ ఫర్ ఆల్: బిల్డింగ్ ఆన్ ఏఐ-రెడీ వర్క్ ఫోర్స్ ఇన్ ఆసియా-పసిఫిక్' పేరిట ఓ నివేదికను రూపొందించింది. కృత్రిమ మేధ రంగంలో భారత్ కు ఉన్న అవకాశాలు, సవాళ్లను ఇందులో పొందుపర్చింది.

నివేదిక ప్రకారం.. 2030 నాటికి 'ఆసియా-పసిఫిక్' ప్రాంత జీడీపీకి కృత్రిమ మేధ 3 ట్రిలియన్ డాలర్ల వరకు ఆదాయం ఆర్జించగలదు. యువశక్తి, వేగంగా అభివృద్ధి చెందుతున్న జనాభా కలిగిన భారత్ ఇందులో కీలక పాత్ర పోషించగలదు. ఏఐ ఆధారిత ఆటోమేషన్లో పురోగతిని లెక్కలోకి తీసుకుంటే.. డేటా ఎంట్రీ, షెడ్యూలింగ్, కస్టమర్ సర్వీస్ వంటి అడ్మినిస్ట్రేటివ్, సపోర్ట్ రంగాల్లోని ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉంది. ఈ తరహా ఉద్యోగాల్లో మహిళలు, అసంఘటిత కార్మికులు, డిజిటల్ అక్షరాస్యతలో వెనుకబడినవారే ఎక్కువగా ఉన్నారు. మాన్యుఫాక్చరింగ్, టెక్స్‌టైల్, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెద్దమొత్తంలో

...మిగతా 2లో

## వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు ఆమోదం

తన కలల బిల్లును చట్టంగా మారుస్తూ ట్రంప్ సిగ్నేచర్

సెనెట్లో సుదీర్ఘ చర్చ అనంతరం ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ టై బ్రేకర్ ఓటుతో గట్టెక్కిన బిల్లు



**న్యూయార్క్, జూలై 5:** అమెరికా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'పై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేశారు. రిపబ్లికన్ సభ్యులు, అధికారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న వేళ ఈ బిలుకు తన సంతకంతో చట్టరూపం కల్పించారు. పన్నుల్లో కోత, వ్యయ నియంత్రణల కోసం ఈ బిల్లును తీసుకొచ్చారు. ఈ బిల్లుపై ఇటీవల సెనెట్లో సుదీర్ఘ చర్చ సాగింది. ముగ్గురు రిపబ్లికన్లు వ్యతిరేకంగా ఓటు వేసినప్పటికీ 51-50 తేడాతో అక్కడ ఆమోదం లభించింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ టై బ్రేకర్గా మారి బిల్లును గట్టెక్కించారు. అనంతరం ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. సుదీర్ఘ చర్చ అనంతరం జరిగిన ఓటింగ్లో బిల్లుకు అనుకూలంగా 218, వ్యతిరేకంగా 214 ఓట్లు వచ్చాయి. ప్రతినిధుల సభలో

...మిగతా 2లో

# డాక్టర్‌ల సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్‌ల సమస్య తీర్చిన ప్రభుత్వం

- పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టి.జి.భరత్...

**కర్నూల్ జూలై 5:** మనం న్యూస్ జిల్లాలోని డాక్టర్ల సర్టిఫికెట్ రెన్యువల్, రీ-రిజిస్ట్రేషన్ మరియు ఇతర సేవల కొరకు జిల్లాలోనే రిజిస్ట్రేషన్ యూనిట్ ఏర్పాటు చేసి డాక్టర్ ల రిజిస్ట్రేషన్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చిందని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ పేర్కొన్నారు.

శనివారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజ్ కాంప్లెక్స్ లో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన డాక్టర్ సర్టిఫికెట్ల రిజిస్ట్రేషన్ యూనిట్ ను పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడు ప్రజలకు మంచి చేయాలి అని నూతనంగా ఆలోచించే స్వభావం కలవారు. దానిలో భాగంగా ప్రజలకు 500 సర్వీసులతో వాట్సాప్ గవర్నెన్స్ ను అభివృద్ధి చేశారు. అదేవిధంగా మన రాష్ట్రంలో ఉన్న డాక్టర్లు వారి సర్టిఫికేట్ ల రిజిస్ట్రేషన్ లు, రీ- రిజిస్ట్రేషన్ లు ఇతర సేవలను ఎక్కడికక్కడ జిల్లాలో చేయించే ఏర్పాట్లు చేశారు. గతంలో రిజిస్ట్రేషన్ల కొరకు విజయవాడకు వెళ్ళవలసి వచ్చేది, విజయవాడకు వెల్లడము, ఏదైనా సర్టిఫికెట్ తక్కువ అయితే తిరిగి వెనక్కి రావడం చాలా శ్రమతో మరియు ఖర్చు తో కూడుకున్న వ్యవహారం, డాక్టర్ తమ విలువైన సమయం వెచ్చించడం 60 సంవత్సరాలు పై బడ్డ డాక్టర్లకు ఇంకా కష్టంగా ఉంటుంది. ఆ కష్టాల నుండి డాక్టర్లను విముక్తి చేశారు. ఇప్పుడు జిల్లా కేంద్రంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. అందుకు మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మరియు రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నా అని మంత్రి టి.జి భరత్ అన్నారు. ఇటువంటి సేవలను డెంటల్ డాక్టర్లకు కూడా వర్తింప చేసే చర్యలు చేపట్టాలని చైర్మన్ ను మంత్రి కోరారు.

ఈ సందర్భంగా డాక్టర్ దగ్గుమాటి శ్రీహరి రావు (ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ )మాట్లాడుతూ... జిల్లా స్థాయిలోనే రీ-రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ చేయించే సేవలను తీసుకుని వచ్చామని , ప్రతి శనివారం, ఆదివారం ఈ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. గతంలో 40 వేల నుండి 50 వేల వరకు ఉండే రీ-రిజిస్ట్రేషన్ ను ఇప్పుడు 75 సంవత్సరాలు పైన ఉన్న వారికి 6 వేల రూపాయలకు, 75 సంవత్సరాలు లోపల ఉన్నవారికి 8 వేల రూపాయలకు రిజిస్ట్రేషన్ చేయబడుతుందని తెలియజేశారు. ఐదు సంవత్సరాల కాలం కంటే మూడు నెలల ముందు గా కూడా రెన్యువల్ చేసుకోవచ్చని, బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు ఆన్లైన్ లోనే రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు.

ఈ సందర్భంగా ఆదోని శాసనసభ్యులు డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ...చాలామంది డాక్టర్లు రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకొనకుండా ప్రాక్టీస్ లో ఉంటారని, దీనివల్ల వారి వైద్య వృత్తికి ఇబ్బందులు కలుగుతాయని , ఇప్పుడు విజయవాడకు వెళ్లకుండా కర్నూల్లోనే రెన్యువల్ మరియు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉన్నందున డాక్టర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ విధమైన ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని మెడికల్ కౌన్సిల్ను అభినందించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరి ఇండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినర్సమ్మ లు మాట్లాడుతూ... డాక్టర్లకు ఈ విధమైన మంచి అవకాశం కల్పించిన మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి మరియు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశానికి కళాశాల ప్రొఫెసర్ లు పాల్గొన్నారు.

# విస్తరిస్తున్న కృత్రిమ మేధ

(మొదటి పేజీ తరువాయి)

అసంఘటిత కార్మికులు ఉన్నారు. ఈ రంగాలను ఏఐ, ఆటోమేషన్లు తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఏఐ స్కిల్స్ ను అందిపుచ్చుకోని క్రమంలో వీరు ఉద్యోగ మార్కెట్లో వెనుకబడిపోయే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది.

దేశ యువతలో చాలామంది ప్రస్తుతం తమ మొదటి ఉద్యోగ వేటలో ఉన్నారు లేదా మెరుగైన అవకాశాల కోసం నైపుణ్యాలను పెంచుకోవాలని ఆశిస్తున్నారు. ఈ నివేదిక ప్రకారం.. యువత పొందుతున్న నైపుణ్య శిక్షణకు, సంస్థలు ఆశిస్తున్న వాటిమధ్య సంబంధం లేనట్లు కనిపిస్తోంది.

అభ్యర్థుల విషయంలో కొన్నేళ్ల క్రితం ఉన్నవాటితో పోలిస్తే చాలా భిన్నమైన ప్రొఫైల్లను నేడు సంస్థలు కోరుకుంటున్నాయి. కేవలం డిగ్రీలే కాకుండా.. క్రిటికల్ థింకింగ్, అవసరానికి తగినట్లు తమనుతాము మార్చుకోవడం, ఏఐ టూల్స్ ను సమర్థంగా ఉపయోగించడం వంటి నైపుణ్యాల కోసం చూస్తున్నాయి. భారత్లో 'ఏఐ'ను అందిపుచ్చుకునే విషయంలో డిజిటల్ యాక్సెస్ కూడా ప్రధాన అడ్డంకి. అనేక గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇప్పటికీ స్మార్ట్ఫోన్లు, ఇంటర్నెట్ సదుపాయం లేదు. ఉజ్వల ఏఐ భవిష్యత్తు కోసం ఈ డిజిటల్ అంతరాలను తగ్గించాలని నివేదిక సిఫార్సు చేసింది.

దేశ శ్రామిక శక్తిలో దాదాపు 35 శాతం మహిళలే. ఆటోమేషన్ ముప్పు పొంచి ఉన్న ఆఫీస్ సపోర్ట్, రిటైల్ సేవల వంటి రంగాల్లో వీరి ప్రాతినిధ్యమే అధికం. కుటుంబ బాధ్యతల కారణంగా చాలా మంది మహిళలు ఉద్యోగాల నుంచి వైదొగులుతున్నారు. తిరిగి వచ్చే క్రమంలో.. వేగంగా మారుతున్న ఉద్యోగ మార్కెట్ నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మహిళల కోసం అనువైన, సందర్భోచిత ఏఐ నైపుణ్య కార్యక్రమాలను రూపొందించాలని సూచించింది.

2024లో దేశంలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఉద్యోగ అవకాశాల కోసం ఇబ్బంది పడ్డారని ఓ వార్తాసంస్థ కథనాన్ని ఈ నివేదిక ఉటంకించింది. దీని ప్రకారం.. 15 లక్షల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 10 శాతం మందికే ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగ డిమాండ్లకు అనుగుణంగా శిక్షణను అందించాల్సిన అవసరం ఉందని నివేదిక తెలిపింది.

**ఏఐ నైపుణ్యాలు కలిగిన శ్రామిక శక్తి పెంపు కోసం నివేదిక సిఫార్సు చేసిన చర్యలు..**

- ఫ్రెషర్లు, అసంఘటిత కార్మికులు, మహిళలు, డిజిటల్ అక్షరాస్యతలో వెనుకబడినవారు.. ఇలా ఉద్యోగార్థుల వైవిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శిక్షణ కార్యక్రమాలు రూపొందించాలి.
- సర్వేలో పాల్గొన్న వారిలో 40 శాతం మంది నిజ జీవితంలో ఉపయోగపడే, పరిస్థితులకు తగిన శిక్షణను కోరుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాక్టికల్ నైపుణ్యాలపై దృష్టి సారించాలి.

# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

లబ్దిదారులను ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2029 నాటికి నియోజకవర్గంలో 100% అర్హులందరికీ ఇళ్ళులు తప్పనిసరిగా ఉండాలని, అందుకనుగుణంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ పాఠశాలల స్థితిగతులను పరిశీలించి, అవసరమైన ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, పాతబస్తీలో విచ్చలవిడిగా ఉన్న కరెంట్ తీగల సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రధాన రహదారుల వెంట గోడలను శుభ్రపరిచి పెయింటింగ్ వెయ్యాలని, మొక్కలు నాటడం మరింత వేగవంతం చేయాలన్నారు. పార్కింగ్, వెండింగ్ జోన్ల ఏర్పాటు, పున్నమి రెస్టారెంట్ వెనుక ఖాళీ స్థలంలో వెండింగ్ జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు రహదారులపై ఆక్రమణలు తొలగించాలని, టిడ్కో గృహాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలని సూచించారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వం రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. తొలి సమావేశంలో పీ4 అమలు, ప్రధాన సమస్యల పరిష్కారం, అనేక అంశాలపై చర్చించామని వెల్లడించారు. భవిష్యత్తులో పేదరికం లేని సమాజాన్ని నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. అదేవిధంగా తాను ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15లక్షల బంగారు కుటుంబాలు, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పీ4 ద్వారా సంక్షేమ పథకాల కోత ఉండదని, ఇది సంక్షేమానికి అదనమని సీఎం స్పష్టం చేశారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం, నిరంతర గైడెన్స్ ఇవ్వడం వంటివి మార్గదర్శులు బాధ్యత తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, తహశీల్దార్ రవికుమార్, మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్, హార్టికల్చర్ ఏడి విజయలక్ష్మి, సిఎంఎం భాస్కర్ రెడ్డి, సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ హెల్మెట్లపై కేంద్రం ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, రైడర్ల భద్రత అత్యంత ముఖ్యమని ప్రభుత్వం పేర్కొంది. మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని గుర్తుచేసింది. రోడ్ల పక్కన అమ్మే నాణ్యత లేని హెల్మెట్ల వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. నాణ్యమైన హెల్మెట్ల వాడకం ద్వారా తలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదాలు తగ్గుతున్నప్పటికీ, ఈ విషయంలో ఇంకా చాలా చేయాల్సి ఉందని నిపుణులు చెబుతున్నారు. హెల్మెట్ల నాణ్యతను నిర్ధారించేందుకు 2021లోనే కేంద్రం ఒక క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్ను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం, బీఐఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లను మాత్రమే విక్రయించాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 176 సంస్థలకు మాత్రమే నాణ్యమైన హెల్మెట్లు తయారు చేయడానికి బీఐఎస్ లైసెన్సులు ఉన్నాయి. నిబంధనల అమలును పర్యవేక్షించడానికి బీఐఎస్ అధికారులు నిరంతరం ఫ్యాక్టరీలు, మార్కెట్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 500కు పైగా హెల్మెట్ నమూనాలను పరీక్షించగా, బీఐఎస్ మార్క్ను దుర్వినియోగం చేస్తున్న వారిపై 30కి పైగా సోదాలు నిర్వహించి, హెల్మెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్క ఢిల్లీలోనే లైసెన్సులు రద్దయిన 9 సంస్థల నుంచి 2,500కు పైగా నాణ్యత లేని హెల్మెట్లను అధికారులు సీజ్ చేశారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగానికి కేంద్రం ఇప్పటికే లేఖలు రాసింది.

# ఆ దేశ ప్రధాని బీహార్ ముద్దుబిడ్డే

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. శుక్రవారం ట్రినిడాడ్ అండ్ టొబాగ్ పర్యటనను ముగించుకున్న ప్రధాని మోడీ శుక్రవారం అర్జెంటీనాకు బయలు దేరు.

**సోహారీ ఆకులో భోజనం..**

ఈ సందర్భంగా కమ్లా ఇచ్చిన విందులో మోడీకి సంప్రదాయ రీతిలో సోహరీ ఆకుపై భోజనం వడ్డించారు. ఆ ఫొటోను మోడీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సోహరీ ఆకు దాదాపు అరిటాకులాంటిదే. భారతీయ మూలాలున్న ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రజలు పండగలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఈ ఆకుపైనే భోజనం చేస్తుంటారని ఆ పోస్టులో మోడీ పేర్కొన్నారు.

# 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'కు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

బిల్లును ఇద్దరు రిపబ్లికన్లు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రజలెప్పుడూ ఇంత సంతోషంగా ఉన్నట్లు గతంలో తానెప్పుడూ చూడలేదన్నారు. ఈ చట్టంతో అందరికీ లబ్ధి జరుగుతుందన్నారు. సాయుధ బలగాల నుంచి మొదలు రోజూవారీ కార్మికుల వరకు కొత్త చట్టం మద్దతుగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధుల సభ స్పీకర్ మైక్ జాన్సన్ కు, సెనెట్ మెజారిటీ లీడర్ జాన్ థునెకు ట్రంప్ ధన్యవాదాలు తెలిపారు. అమెరికా చరిత్రలోనే తమ ప్రభుత్వం అతిపెద్ద పన్నుకోత, వ్యయకోత, సరిహద్దు భద్రతలో అతిపెద్ద పెట్టుబడి సాధించిందని పేర్కొన్నారు. ఉత్సవంలా నిర్వహించిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ట్రంప్ మద్దతుదారులు, మిత్రపక్షాలు, మిలిటరీ కుటుంబాలు, వైట్హౌస్ సిబ్బంది తరలివచ్చారు. ఈ సందర్భంగా ఇటీవల ఇరాన్ అణుకేంద్రాలపై దాడి చేసిన అమెరికా స్టెల్త్ బాంబర్లు, ఫైటర్ జెట్లు గగనతలంలో చక్కర్లు కొట్టాయి. ప్రభుత్వ వ్యయాన్ని తీవ్రంగా తగ్గించడం, వలస చట్టాలను అమలు చేయడానికి కావాల్సిన కఠినమైన కొత్త విధానాలకు నిధులు సమకూర్చడం, పలు పన్ను కోతలను శాశ్వతం చేయడం వంటివి ఈ చట్టంలో ఉన్నాయి. అయితే లక్షలాది మంది అమెరికన్లు ఈ చట్టంతో ఆరోగ్య బీమా కోల్పోతారని విశ్లేషకులు భావిస్తున్నారు.

# సహకార సంఘాలతో సుస్థిర అభివృద్ధి

**జెండా ఎగురవేసిన సీఈవో గిడ్డయ్య**



**తుగ్గలి జూలై 5(మనం న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో ఉన్నటువంటి ఉప్పర్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనివారం సీఈవో గిడ్డయ్య ఆధ్వర్యంలో 103వ అంతర్జాతీయ వ్యవసాయ సహకార సంఘ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా సీఈవో గిడ్డయ్య మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధికై సహకారం అనే నినాదంతో అంతర్జాతీయ సహకార దినోత్సవం అనేది 1923 నుండి ప్రతి సంవత్సరం జూలై మొదటి శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం వార్షిక వేడుక జరుగుతుందన్నారు.సహకార సంఘాల ఏర్పాటుతో రైతులకు రుణ సౌకర్యం గ్రామ,మండల స్థాయిలో సంఘాల ఏర్పాటుతో వాటి పరిధిలోని బ్యాంకుల ద్వారా రుణాలు అందుతున్నాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సీఈవో టీ.నాగరాజు, కంప్యూటర్ ఆపరేటర్ యం. సురేంద్ర, క్లర్క్ ఎం.జయ శేఖర్,అటెండర్ వై జి.గిరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వరి నాట్లేసిన సీఎం

- హుడ్కియా బాల్ లో భాగంగా భూమి, నీరు, మేఘాలకు పూజలు

**డెహ్రాడూన్, జూలై 5:** తన నారుమడిలోకి దిగి, పొలాన్ని చదును చేసి, వరినాట్లు వేశారు ముఖ్యమంత్రి పుష్కర్సింగ్ ధామి. ఉత్తరాఖండ్ నాగ్లా తరై గ్రామంలోని తన పంట పొలంలో దిగి, కూలీలతో కలిసి కొద్దిసేపు పని చేశారు. దీనికి సంబంధించిన చిత్రాలను సీఎం తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. 'వ్యవసాయ క్షేత్రంలో పనిచేయడం ద్వారా రైతుల కృషి, త్యాగం, అంకితభావాన్ని స్వయంగా తెలుసుకున్నాను. మరోసారి పాత రోజులు గుర్తుకువచ్చాయి. ఈ రైతులు.. మన ఆర్థికవ్యవస్థకు వెన్నెముక మాత్రమే కాదు.. భావితరాలకు మన సంస్కృతిని అందించే వారధులు' అని రాసుకొచ్చారు. హుడ్కియా బాల్ అనే సంప్రదాయాన్ని పాటిస్తూ.. అందులోభాగంగా భూమి, నీరు, మేఘాలకు పూజలు చేశారు.

# పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి



**దేవనకొండ, జులై 5(మనం ప్రతినిధి):** పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల బియ్యంపు నిర్ణయాన్ని ఉపసంభరించుకోవాలని ప్రధానితో జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి,సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసరావులుడిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) దేవనకొండ మండల సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సమితి పిలుపు మేరకు దేవనకొండ క్రాస్ రోడ్డు టర్నింగ్ నందు రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 15,485 కోట్లు రూపాయలు భారం ప్రజలపై మోపిందన్నారు. అంతేకాక గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షం ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపదలను తీవ్రంగా వ్యతిరేకించారు.ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘము జిల్లా నాయకులు,వై కండప్ప,పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.రవి, ఎం. రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి కె.భాస్కర్, సిపిఐ మండల నాయకులు వీరస్వామి, రఫీ,మహేష్, రషీద్, మద్దిలేటి, హనుమప్ప, వెంకటరాముడు ఆటోహమాలి యూనియన్ నాయకులు మురళి భాష నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 10 మంది పక్కింటోళ్లు పర్మిషనిస్తేనే..

- శునకాలు పెంచుకోవడానికి సరికొత్త నిబంధన పెట్టిన సూరత్ మున్సిపల్ కార్పొరేషన్



**సూరత్, జూలై 5:** సూరత్ నగర పరిధిలో నివాసముంటున్న గృహస్తులు శునకాన్ని పెంచుకోవాలంటే కనీసం 10 మంది పొరుగు వారి నుంచి 'నో అబ్జెక్షన్ సర్టిఫికేట్' తేవాల్సి ఉంటుందని మున్సిపల్ కార్పొరేషన్ షరతు విధించింది. అదే విధంగా అపార్ట్మెంట్లలో శునకాన్ని పెంచుకోవాలంటే ఆ భవనం సంక్షేమ సంఘం ఛైర్ పర్సన్, కార్యదర్శుల అనుమతి తప్పని సరి అంటూ ఉత్తర్వులు జారీ చేసింది. మే నెలలో కుక్క దాడిలో ఓ చిన్నారి మృతి చెందడంతో ఈ నిబంధన విధించాల్సి వచ్చిందని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు.

# కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు


- టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం , జులై 5, మనం న్యూస్:** కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం శనివారం బూదురు గ్రామంలో నిర్వహించారు. అనంతరం గ్రామం లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదని అడిగి తెలుసుకొని, కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో దురదృష్టకర పాలనను చూశామని ప్రజా సమస్యలను ప్రస్తావించిన వారిపై దాడులకు దిగారని విమర్శించారు.విధ్యంసంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనిస్తోందన్నారు.ఈ కార్యక్రమం లో చావిడి వెంకటేష్ ,మాజీ జెడ్పిటిసి ఆర్ లక్ష్మయ్య, కల్లుదేవకుంట సొసైటీ సహకార సంఘం డైరెక్టర్ ఆర్ లక్ష్మయ్య మాలపల్లి చంద్ర , సూగురు బాస్కర్ రెడ్డి , చెట్నేహాళ్ళి నాయకులు చాపల నాగేష్ ,బూదురు గ్రామ నాయకులు మోజేష్ , అబ్రహం,



దాసు,శాంతిరాజు,ఈరన్న, లక్ష్మికాంత్, రామయ్య , మంత్రాలయం నాయకులు వరదరాజు, డిసి తిమ్మప్ప , వగరూర్ నాయకులు గోపాల్ , వీరారెడ్డి , లింగప్ప టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైకాపా పార్టీ బలోపేతానికి కృషి చేయండి



- మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ, జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

**తుగ్గలి, జులై 5(మనం న్యూస్):** వైసిపి పార్టీ బలోపేతానికి, పొందిన పదవులకు వన్నె తేవాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ,వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి సూచించారు.శనివారం కర్నూలు లో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ,వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డిలను నూతనంగా పార్టీ పదవులు పొందిన తుగ్గలి మండల పరిధిలోని అమినాబాదు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి రైతు విభాగపు జిల్లా ఉపాధ్యక్షులు,మాజీ ఎంపీపీ రామాంజనేయులు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్చం అందజేశారు.మాజీ ఎమ్మెల్యే,జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజ లకు మరింత సేవలు చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు గిరిగేట్ల విష్ణువర్ధన్ రెడ్డి,పని భూషణ్ రెడ్డి,సోలా రంగన్న,పక్కీరప్ప,హనుమేష్ యాదవ్,జొన్నగిరి ఓబులేష్,దాసరి నారాయణ,ఎంబాయి సూర్య చంద్రతదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి 30వేలు జరిమానా



**పత్తికొండ, జూలై 5(మనం న్యూస్):** మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులకు కోర్టులో జరిమాన పడినట్లు పత్తికొండ సీఐ జయన్న ఓ ప్రకటనలో తెలిపారు. పత్తికొండ పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిని పత్తికొండ కోర్టులో శనివారం హాజరు పరిచారు. ఒక్కొక్కరికి 10వేలు చొప్పున ముగ్గురికి 30వేలు జరిమానా వేస్తూ పత్తికొండ జడ్జి జోత్స్న దేవి తీర్పునిచ్చారని సీఐ జయన్న తెలిపారు.కావున మద్యం తాగి ఎవరూ కూడా వాహనాలు నడపవద్దని.. పట్టుపడితే అది ఎవరైనా సరే జైలుకు వెళ్లాల్సిందేనని సీఐ జయన్న హెచ్చరించారు.

# అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**ఆదోని, జూలై 5 (మనం న్యూస్):** అర్హులైన ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు డివిజన్లో 4,540 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం అర్హులైన వారికి ఇవ్వాలి. ఈ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయంగా నిర్వహించాలి అని తెలిపారు. ప్రతి దరఖాస్తును పూర్తిగా వెరిఫై చేసి అర్హులను ఖరారు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆదోని రూరల్లో 551, ఆదోని అర్బన్లో 2,256 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. పెద్ద కడబూరు మండలంలో కేవలం 31 దరఖాస్తులు మాత్రమే రావటంపై కారణాలు ఆరా తీయాలని సూచించారు. అర్హులందరికీ పట్టాలు మంజూరు చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించేలా పత్రికా ప్రకటనలు విడుదల చేయాలని ఆదేశించారు. అలాగే, హైకోర్టు ఆదేశాల మేరకు చెరువులు, నీటి




వనరులపై అక్రమ కట్టడాలు తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి మండలంలో వాటర్ బాడీస్ పై తనిఖీలు చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. వచ్చే వారం నుండి మండలాలలో విస్తృత పర్యటనలు నిర్వహించి పి.జి.ఆర్.ఎస్., సీఎంఓ గ్రీవెన్స్ వంటి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులను పనిచేయాలన్నారు. ఈ సమీక్షలో పరిపాలన అధికారి కె. వసుంధర, మున్సిపల్ కమిషనర్ కె. కృష్ణ, డివిజన్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి

**కర్నూలు జులై 05,మనం న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేసి,జీవో నెంబర్.77 ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాబీర్ భాష, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్ లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 6,400 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్ మెంట్,స్కాలర్ షిప్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ గారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్రలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులకు ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చి,అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా 2600 కోట్లు విడుదల చేస్తామని,




చెప్పి,నేటికీ విడుదల చేయలేదని,విద్యార్థుల ఖాతాల్లో పడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ,ఇంజనీరింగ్, పీజీ లు చదువుతున్న విద్యార్థులు తమ కోర్సులు పూర్తి చేసుకొని, ఫీజు రియంబర్స్ మెంట్ అందక, కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక, విద్యార్థులు అయోమయంలో పడిపోయి,ఉన్నత విద్యాను అభ్యసించలేక, ఇతర ఉద్యోగాలకు వెళ్లలేని దీన స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ యూనివర్సిటీ నాయకులు ఆలీ,ప్రశాంత్,జగన్,కళ్యాణ్, నాయక్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నిజాయితీ చాటుకున్న టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగులు

**తిరుమల, జూలై 5(మనం న్యూస్):** టీటీడీలో తిరుమల అతిథి గృహంలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న సిబ్బంది నిజాయితీ చాటుకున్నారు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో మరిచిపోయి వెళ్ళిన సుమారు రూ. 12 లక్షల విలువైన బంగారు నగలను తిరిగి వారికి అప్పగించారు. మధురైకి చెందిన శివ అనే భక్తుడు వారి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం శుక్రవారం తిరుమలకు వచ్చాడు తిరుమలలోని పద్మావతి అతిథిగృహల సముదాయంలోని వకుళమాత అతిథి గృహంలో వసతిని పొందారు. శనివారం స్వామివారి దర్శనం అనంతరం, తిరుగు ప్రయాణంలో గదిని ఖాళీ చేసే సమయంలో పొరపాటున వారి బంగారు నగలు మరిచిపోయారు.

గదిని శుభ్రం చేయడానికి వచ్చిన టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగులు వెంకటముని, తుకా రాం సోమ మంద్రకర్, వీటిని గుర్తించి టీటీడీ సూపరింటెండెంట్ భాస్కర్ నాయుడుకి అందజేశారు. భాస్కర్ నాయుడు భక్తులకు ఫోన్ చేసి వారి నగలను అధికారుల సమక్షంలో వారికి అందజేశారు. పోగొట్టుకున్న బంగారం నగలు తిరిగి వారికి దక్కినందుకు భక్తులు సంతోషం వ్యక్తం చేస్తూ టీటీడీ సిబ్బంది నిజాయితీని అభినందించారు.

# మామిడి ప్రాసెసింగ్ యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు

- మామిడి ప్రాసింగ్ యూనిట్లు మామిడి పండ్లు కనీస ధరకు రైతుల వద్ద కొనుగోలు చేయాలి
- రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ: చిరంజీవి చౌదరి
- మామిడికాయ రైతులకు అండగా.. ప్రభుత్వం: జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, జూలై 5(మనం న్యూస్):** మామిడి ప్రాసింగ్ యూనిట్లు మామిడి పండ్లు కనీస ధర కు రైతుల వద్ద కొనుగోలు చేయాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు చిత్తూరు ఉమ్మడి జిల్లాలో మామిడికాయ గుజ్జు పరిశ్రమ యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, ఎండి శేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ మామిడి కాయ రైతులను ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వచ్చే బడ్జెట్లో మ్యాంగో బోర్డు మ్యాంగో బోర్డు చిత్తూరు నందు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదికలు అందజేయడం జరిగిందని తెలిపారు. పల్ప్ ప్రాసెసింగ్ లో 8 కోట్లు బకాయిలు విడుదల చేయడానికి ప్రభుత్వం పరిశీలనలో ఉన్నదని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్లుకి కూడా మామిడి ప్రాసింగ్ ఉత్పత్తుల పై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ రద్దు చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే లేఖ రాశారు. మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్లు యజమానుల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం చూపేందు కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చాలా గట్టిగా పని చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన మామిడి రైతుల సమస్యల సంక్షోభ నివారణ కు మామిడి ప్రాసింగ్ యూనిట్లుయజమానులు ముందుకు రావాలి. మామిడి ప్రాసింగ్ ఉత్పత్తులను పెద్ద పెద్ద ఫంక్షన్లో, ఇతర కార్యక్రమాల్లో కొని పంపిణీ చేసేలా ప్రాసెసింగ్ యూనిట్లు యజమానులు తమ మార్కెట్ల విస్తరణ వైపు దృష్టి సారించాలి. మీ సమస్యలు పరిష్కారం కొరకు ఏ సమయంలోఎప్పుడూ కావాలన్న జోక్యం చేసుకుని ప్రాసెసింగ్ యూనిట్లు కి మద్దతు సాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతకు మునుపు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటి వరకూ 1.15 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలు జరిగిందని ఇంకా 1.70 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ఉత్పత్తి ఇంకా రావాల్సి ఉందని తెలిపారు. కంపెనీల యాజమాన్యులు మాట్లాడుతూ మ్యాంగో పల్ప్ పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా అధికారులు కృషి చేయాలని, మద్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు మూడు రోజుల పాటు మ్యాంగో జ్యూస్, పవిత్ర దేవాలయాలలో, భక్తులకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని పరిశ్రమల ప్రతినిధులు సమావేశంలో దృష్టికి తీసుకువచ్చారు. అయితే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారంగా గుడ్డును అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ అంశంపై అధ్యయనం చేసి తదుపరి ఆలోచన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సెక్రటరీ శ్రీ చిరంజీవి చౌదరి గారితో కలిసి, జిల్లా కలెక్టర్ శ్రీ సుమిత్ కుమార్ గారు జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యార్థి, ఎం.డి.శేఖర్, డి.డి. హార్టికల్చర్ మధుసూదన్ రెడ్డి, ఫుడ్ అండ్ ఇన్స్, సిద్ధార్థ ఆగ్రో, సువేరా, మంజునాథ, ఎఫ్ -త్రీ, సన్ గోల్డ్, జైన్, టోపో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఆర్ఎంఎన్ ఫుడ్ ప్రొడక్ట్స్ నేచుర్ ఫుడ్స్, గళ్ళ ఫుడ్స్, జయ భారతి, వివిధ గుజ్జు పరిశ్రమల కంపెనీలు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీలో నిర్మాణ భవనాలను వెంటనే పూర్తి చేయాలి

- టీటీడీ ఈవో జె.శ్యామలరావు



**తిరుపతి(టీటీడి), జూలై 5(మనం న్యూస్):** శ్రీవారి భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న భవనాలను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలసి శనివారం అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ టిటిడిలో జరుగుతున్న పనులపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుని నిర్దేశించిన సమయానికి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గుత్తేదారులలో అలసత్వం లేకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి నివేదిక సమర్పించాలని కోరారు. టిటిడిలో దళారి వ్యవస్థ, నకిలి టికెట్ల పేరుతో సేవల టికెట్ల అమ్మకాలు, అవినీతిపై మరింత నిఘా ఉంచేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు మరింత నాణ్యంగా, వేగంగా సేవలు అందించేందుకు అలిపిరి టోల్ గేట్ ప్లాజా వద్ద చెకింగ్ పాయింట్ విస్తరణ, లేటెస్ట్ కెమెరాల ఏర్పాటు, వాహనాలు, లగేజీ స్కానింగ్ యంత్రాలు, సెక్యూరిటీ పెంచే అంశం తదితర అంశాలపై టిటిడి సెక్యూరిటీ, ఇంజనీరింగ్, ఐటీ అధికారులు అంతర్జాతీయ విమానాశ్రయాలలో సౌకర్యాలను పరిశీలించి నివేదిక సమర్పించాలన్నారు. భక్తులకు మరింత సౌకర్యవంతంగా, పరిశుభ్రంగా, ఆధునిక సౌకర్యాలతో కళ్యాణ కట్ట కొరకు ఎంపిక చేసిన ప్రాంతంలో ప్రయోగాత్మకంగా నిర్మాణం చేపట్టి దశలవారీగా విస్తరణ చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు అందించేందుకు నిల్వ వుంచే వంట సామగ్రి కోసం మార్కెటింగ్ గోడౌన్‌లో కోల్ స్టోరేజ్ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అలిపిరి భూదేవి కాంప్లెస్ లో ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయం, శ్రీ కపిలతీర్థం, నారాయణవనంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, నాగలాపురం శ్రీ వేదనారాయణ స్వామి ఆలయం, అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయం, తిరుమలలోని పాపవినాసం, శిలాతోరణం ప్రాంతాలలో వేగంగా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆదేశించారు. నవీ ముంబై, బాంద్రా, యానం, అనంతవరం, ఉల్లందూర్ పేట తదితర ప్రాంతాలలో ఆలయాల నిర్మాణాలపై తాజా పరిస్థితిని నివేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో వి. వీరబ్రహ్మం, సివిఎస్వో కె.వి. మురళీకృష్ణ, ఎఫ్.ఏ అండ్ సీఏవో ఓ. బాలాజీ, టివి సత్యనారాయణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు సత్కారం



- అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చ

**తిరుపతి కలెక్టరేట్, జూలై 5(మనం న్యూస్):** తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వేంకటేశ్వర్ జిల్లా కలెక్టర్గా బాధ్యతలు చేపట్టి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా, సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆదిమూలం ఆయనను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ని సత్కరించిన ఎమ్మెల్యే, జిల్లా అభివృద్ధికి ఆయన అందిస్తున్న విశేష సేవలను ప్రశంసించారు. కలెక్టర్‌తో ఎమ్మెల్యే కె.ఆదిమూలం ప్రత్యేకంగా సమావేశమై, సత్యవేడు నియోజకవర్గంలోని మౌలిక సదుపాయాలు, రహదారులు, సాగునీటి పథకాలు, విద్యా, వైద్య రంగాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ప్రజల సమస్యలపై త్వరిత స్పందన, ప్రాజెక్టుల అమలులో సమర్థత వంటి అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల సమన్వయంతో కలెక్టర్ డా. వేంకటేశ్వర్ చూపిస్తున్న చొరవను ఎమ్మెల్యే కొనియాడారు.

## చెన్నకేశవ, సిద్ధేశ్వర స్వాముల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

**తిరుపతి, జూలై 5(మనం న్యూస్):** టీటీడీకి అనుబంధంగా ఉన్న అన్నమయ్య జిల్లా తాళ్లపాకలోని శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ సిద్ధేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంకుర్పాణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ సిద్ధేశ్వర స్వామి వారి ఆలయంలో సాయంత్రం 05.00 గం.లకు, శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఆలయంలో సాయంత్రం 06.00 గం.లకు అంకురార్పణ జరిగింది.



### సిద్ధేశ్వరస్వామి వాహన సేవలు

జూలై 6వ తేదీ ఉదయం 06.16 గం.లకు ధ్వజారోహణంతో బ్రహ్మో త్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి హంసవాహన సేవ నిర్వహిస్తారు. జూలై 07న ఉదయం పల్లకీ సేవ, రాత్రి చంద్రప్రభ వాహనం, జూలై 08న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి చిన్నశేష వాహనం, జూలై 09న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి సింహ వాహనాలపై స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. 10న ఉదయం పల్లకీ సేవ, రాత్రి నంది వాహనం సేవ చేపడుతారు. జూలై 11న సాయంత్రం 6.00 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.300/- చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఆ తరువాత రాత్రి 07.30 గంటలకు గజ వాహనంపై స్వామివారు విహరించనున్నారు. జూలై 12న సాయంత్రం పల్లకీ సేవ, జూలై 13న రాత్రి 6.00 గంటలకు పార్వేట ఉత్సవం, జూలై 14న ఉదయం 10.00 - 12.00 గంటలకు వసంతోత్సవం, త్రిశూలస్నానం, సాయంత్రం 05.00 - 06.00 గం.ల మధ్య ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. జూలై 15వ తేదీన ఉదయం 09.00 గం.లకు స్నపన తిరుమంజనం, రాత్రి 06.00 - 08.00 గం.ల మధ్య పుష్పయాగం చేపడుతారు.

### చెన్నకేశవ స్వామి వాహన సేవలు

జూలై 6న ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య సింహలగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి శేషవాహన సేవ నిర్వహిస్తారు. జూలై 07న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, జూలై 08న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి సింహ వాహనం, జూలై 09న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి హనుమంత వాహనాలపై స్వామివారు భక్తులకు కనువిందు చేస్తారు. జూలై 10న ఉద యం 09.00 గం.లకు మోహినీ అవతారం, రాత్రి గరుడసేవ నిర్వహిస్తారు.

జూలై 11వ తేదీ సాయంత్రం 6 గం.లకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు (ఇద్దరు) రూ.300/- చెల్లించి ఈ కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఆ తరువాత రాత్రి 08.30 గంటలకు గజ వాహనంపై స్వామివారు విహరిస్తారు. జూలై 12న సాయంత్రం 06.00 - 08.00 గం.ల మధ్య రథోత్సవం, జూలై 13న రాత్రి అశ్వవాహనం, జూలై 14న ఉదయం 09.30 - 10.15 గంటలకు చక్రస్నానం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం 6.00 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. జూలై 15వ తేదీన ఉదయం 9 గంటలకు చెన్నకేశవస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం ఘనంగా జరుగనుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ హరికథలు, ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో సూపరింటెండ్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీబాలాజీ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# బాబు ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలి

- స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు



**తిరుపతి, జూలై 5(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఊసరవెల్లి రాజకీయాలు మానుకొని ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ రామానాయుడు డిమాండ్ చేశారు . శనివారం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద సిపిఐ నగర్ సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తూ తగ్గించాలని నిరసన ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలకు భారంగా మారనున్న స్మార్ట్ మీటర్ల బిగింపును నాడు పాదయాత్రలో లోకేష్ చంద్రబాబు నాయుడులు స్మార్ట్ మీటర్లు బద్దలు కొట్టండని చెప్పి నేడు బలవంతంగా ఇళ్లకు పాత్ మీటర్లు బిగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోకపోతే అలాగే ఆదానితో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకపోతే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం కాక ముందే విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 15485 కోట్ల వారు ప్రజలపై మోపడం దారుణం అన్నారు రాష్ట్రాన్ని ఆదానికి అప్పగించే ప్రయత్నంలో భాగమే ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం సిగ్గుచేటు అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచనని ఎన్నికలలో హామీలు ఇచ్చి అధికారం వచ్చిన తర్వాత ప్రజలపై భారాల మోపుతూ కార్పొరేటర్లకు అనుకూలమైన పాలన కొనసాగించడం బట్టి చూస్తే రాబోవు రోజుల్లో జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో జనాన్ని దోపిడీ చేసి కార్పొరేటర్లకు దోచిపెట్టడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సాగిలపడి పని చేస్తున్నదని విమర్శించారు ప్రస్తుతం పాత బిల్లుల కంటే స్మార్ట్ మీటర్లు ద్వారా వచ్చిన బిల్లులు పెద్ద మొత్తాలలో బిల్లులు స్తున్నాయని దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతారని అందుకోసం ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే తక్షణమే స్మార్ట్ మీటర్ల నో రద్దుచేసి ఆదానితో స్మాట్ మీటర్ల ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య కే రాధాకృష్ణ బండి చలపతి ఉదయ్ కుమార్ నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి కే పద్మనాభరెడ్డి ఎం రామకృష్ణ ఎం శివ కేవై రాజా వివిధ ప్రజా సంఘాల నాయకులు మహేంద్ర శ్రీనివాసులు జె నాగరాజు హరిబాబు వరలక్ష్మి మీనా తదితరులు పాల్గొన్నారు.

## 16న శ్రీవారి ఆణివార ఆస్థానం



- రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల, జూలై 5(మనం న్యూస్):** జూలై 16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం ఘనంగా జరగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని జూలై 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఈ రెండు రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినట్లు టీటీడీ అధికారులు ప్రకటించారు. జూలై 14, 15వ తేదీలలో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

## బాబుతోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పులివర్తి నాని
- గ్రామ స్వరాజ్య సుపరిపాలన తొలి అడుగు
- తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి



తిరుపతి రూరల్, జూలై 5(మనం న్యూస్): తిరుపతి రూరల్ మండలం, ఉమ్మడి మంగళం పంచాయతీలో 4వ రోజు కొనసాగుతున్న సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి రూరల్ టిడిపి అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి. ముందుగా మంగళం పంచాయతీకి విచ్చేసిన ఎమ్మెల్యే కి ఘనస్వాగతం పలికిన మహిళలు ,నాయకులు, కార్యకర్తలు. పంచాయతీలో ఇంటింటికి వెళ్లి సుపరిపాలన తొలి అడుగు మరియు తిరుపతి రూరల్ మండలంలో చేసిన అభివృద్ధి పనుల కరపత్రాలను పంచుతూ వివరించిన ఎమ్మెల్యే. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పంచాయతీలోని ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ పంచాయతీలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని ప్రజలకు తెలియాజేశారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని ప్రజలకు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఒక్కటిని నెరవేస్తున్నామని ప్రజలకు తెలిపారు. రామచంద్రనగర్ లో రేషన్ సమస్య ఎక్కువగా ఉంది... మహిళలు సమస్య ను నా దృష్టికి తెచ్చారు. అసంపూర్తిగా ఉన్న గుడిని పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరిన మహిళలు. చెన్నయగుంట చెరువును అభివృద్ధి చేస్తానని స్థానికులకు తెలిపిన ఎమ్మెల్యే. పి4 విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెట్టి పేదలను ఆదుకునే దిశగా ముందుగు వెళ్తున్నది అని ప్రజలకు తెలిపినరు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మర్యాద పూర్వక కలయిక



- పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

**తిరుపతి కలెక్టరేట్,జూలై 05,మనం న్యూస్:** తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) కొత్త సెక్రటరీగా డాక్టర్ ఎన్.వి. శ్రీకాంత్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ని జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిశారు. తాజాగా తన పదవిలోకి ప్రవేశించిన శ్రీకాంత్ బాబు, జిల్లా అభివృద్ధిలో తుడా పాత్ర, ప్రాధాన్యతలపై కలెక్టర్తో సుదీర్ఘంగా చర్చించారు. నగర అభివృద్ధికి సంబంధించిన, ప్రాధాన్యతా ప్రాజెక్టులపై ఇద్దరూ అభిప్రాయాలు చర్చించుకున్నారు. తిరుపతి నగరం సమగ్ర అభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలనే దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీకాంత్ బాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ, తుడా కార్యాలయ పనితీరు మరింత సమర్థవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. నగర అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు త్వరితగతిన అమలు కావలసిన అవసరం ఉందని ఆయన సూచించారు.

# 10న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్, జూలై 5(మనం న్యూస్):** తిరుపతి జిల్లా వ్యాప్తంగా జూలై 10న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం తిరుపతి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరె న్స్ హాల్లో పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది విద్యాశాఖ తరఫున మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ను నిర్వ హించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్ర వ్యాప్తంగా జూలై 10న ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్యసాయి జిల్లాలో ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లా స్థాయిలో ఇన్చార్జి మినిస్ట ర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. తిరుపతి జిల్లాలో కూడా సర్పంచ్ మొదలుకొని ఎంపీపీ, జడ్పీటీసీ ఎంపీ టీసీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొం టారన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు (ప్రైవేట్, ప్రభుత్వ), జూనియర్ కాలేజీలలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఇది ఒక పండుగ వాతావరణంలో, సమగ్ర విద్యా అభివృద్ధికి దోహదపడే విధంగా నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్ పర్'అంటే తల్లి పేరుతో ఒక మొక్కను కూడా అందించి నాటడం జరుగుతుందన్నారు. ఇందుకోసం సామాజిక అటవీ విభాగం, విద్యాశాఖ సమన్వయంతో అన్ని పాఠశాలలకు మొక్కలను సరఫరా చేయడం జరిగిందన్నారు. అలాగే తల్లికి వందనం సంబంధించిన సమస్యల ను కూడా పరిష్కరించి వారి ఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల తో కూడా చర్చించి వారిని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనే లా చేస్తున్నామన్నారు. పాఠశాల విలీనానికి సంబం ధించి పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు జిల్లా కలెక్టర్ సమాధానం ఇస్తూ, గత ఏడాది రేషనలైజేషన్ పద్ధతిన 534 పాఠశాల విలీనం చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామపంచాయతీలలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల అదనంగా ప్రతి క్లాసుకు ఒక టీచర్ రావడం జరుగుతుందన్నారు. గతంలోఆరు



సబ్జెక్టులు ఉంటే అన్నింటికీ ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు ఒకే క్లాస్ టీచర్ ఉండేవారన్నారు. దానిని సంస్కరించడంలో భాగంగా మోడల్ ప్రైమరీ స్కూల్ చేస్తున్నామన్నారు. మూడు నుంచి 5వ తరగతి విద్యార్థులను ఇక్కడ ఉంచడం జరుగుతుంద న్నారు. తద్వారా నాణ్యతగా బోధన జరుగుతుం దనేది దీని ఉద్దేశ్యమన్నారు. ఏ పాఠశాలను కూడా మూసి వేయడం జరగదని, ఒకటి, రెండవ తరగతి తర్వాత ఎక్కువ దూరం ఉంటే అలాంటి విద్యార్థుల కు నెలకు రూ.600ల చొప్పున రవాణా చార్జీని కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ అంశంలో జరగనున్న మంచిని గురించి ప్రజలకు కూడా వివరించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 650 మోడల్ స్కూల్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐవో రాజశేఖర్, సమగ్ర శిక్ష సీఎండీ సురేష్, సూపరింటెండెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 15 వరకు ఇసుక రవాణా నిషిద్ధం

- జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్



**తిరుపతి కలెక్టరేట్, జూలై 5(మనం న్యూస్):** భారత ప్రభుత్వం, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నదులలో ఇసుక త్రవ్వకం, రవాణాకి సంభందించి కొన్ని మార్గ దర్శకాలను జారీ చేసినట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు నదులలో ఇసుక త్రవ్వకం, రవాణా పూర్తిగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులు, అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సదరు మార్గదర్శకాల ప్రకారం వర్షాకాలంలో నదులలో ఇసుక త్రవ్వకం, రవాణాకి అనుమతించకూడదని భారతదేశంలో నైరుతి రుతు పవనాల ప్రారంభం వలన జూన్ 1 నుండి అక్టోబర్ 15 వరకు వర్షాకాలంలో స్వర్ణముఖి, అరనియర్ నదులలో ఇసుక తవ్వకాలు నిషేధించినట్లు విటిపై పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్, స్థానిక రెవెన్యూ, పోలీస్, మైనింగ్, ఇరిగేషన్ డిపార్టుమెంటుల వారికీ అప్పగించడం జరిగినదని తెలిపారు. వర్షాకాలంలో గూడలి స్వర్ణముఖి బేరేజీ డీ-సిల్టేషన్ యార్డులు, ఆవిలాల తిరుపతి యార్డు, కాటన్ మిల్ తిరుపతి యార్డు, గాజుల మాండ్యం రేణిగుంట యార్డు, శ్రీకాళహస్తి యార్డు, వెంకటగిరి యార్డు, అధీకృత స్టాక్ పాయింట్లలో ప్రభుత్వం వారు నిర్ణయించిన లోడింగ్ చార్జీలు చెల్లించి, కావలసిన పరిమాణంలో ఇసుకను తెచ్చుకొనవచ్చునని లేదా గ్రామ పంచాయతీ పరిధిలో స్థానిక వినియోగదారులువాగులు, వంకలు, కాలువల తమ అవసరాల నిమిత్తం గ్రామ సచివాలయం నందు దరఖాస్తు చేసుకొని, లేదా ఇసుక పోర్టల్ నుంచి నమోదు చేసుకొని, యంత్రములు ఉపయోగించకుండా ఇసుకను మనసుల ద్వారా త్రవ్వకము జరిపి టైరు బండ్లు, ట్రాక్టర్ల ద్వారా రసీదుతో ఉచితంగా తెచ్చుకోవచ్చని తెలిపారు. ఇసుకను గ్రామములోని నిర్మాణ అవసరములకు మాత్రమే ఉపయోగించాలని, బయట ప్రాంతాలకు రవాణా చేయకూడదని అలా చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# తొలి ఏకాదశి విశిష్టత





ఆషాఢ మాసంలోని ఏకాదశిని దేవశయనీ ఏకాదశి అంటారు. తెలుగు ప్రజలు తొలి ఏకాదశిగా పరిగణిస్తారు. ఈ రోజున శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోకి వెళ్తాడు. ఈ చాతుర్మాస తర్వాత ప్రారంభమవుతుంది. దేవశయని ఏకాదశి నుండి నాలుగు నెలల పాటు విష్ణువు నిద్రించే కాలం ఉంటుంది.భాగవత మహాపురాణం ప్రకారం, విష్ణువు ఈ రోజున నిద్రపోతాడు లేదా లోతైన ధ్యానంలోకి వెళ్లి నాలుగు నెలల తర్వాత ప్రబోధిని ఏకాదశి నాడు మేల్కొంటాడు. ఈ కాలం జన్మాష్టమి, గణేష్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వంటి ముఖ్యమైన హిందూ పండుగలతో నిండి ఉంటుంది. చాలా మంది భక్తులు ఉపవాసాలు పాటిస్తారు. ఆధ్యాత్మికంగా గొప్ప చాతుర్మాసానికి సిద్ధమవుతూ విష్ణువు ఆశీర్వాదం కోరుకుంటారు. దేవశయనీ ఏకాదశికి సిద్ధమయ్యే భక్తులు,మునుపటి దశమి తిథి నాడు కొన్ని ఆచారాలను పాటించడం ద్వారా ప్రారంభిస్తారు. వారు తామర ఆహారం, ఉప్పు, బార్లీ, మాంసం, గోధుమలు, పప్పు ధాన్యాలు తినకుండా ఉంటారు. వారి మనస్సు, శరీరాన్ని శుద్ధి చేసుకోవడానికి నేలపై పడుకుంటారు. దశమి, ఏకాదశి తిథి రెండింటిలోనూ నిజం మాట్లాడాలి. ఉపవాసం దశమి తిథి నాడు ప్రారంభమై ద్వాదశి తిథి ఉదయం వరకు కొనసాగుతుంది.భక్తులు ఏకాదశి తిథి నాడు, భక్తులు ఉదయాన్నే నిద్రలేచి, స్నానం చేసి విష్ణువును భక్తితో పూజిస్తారు. ఎర్రటి వస్త్రంతో కుంభాన్ని కట్టి, దాని పైన భగవంతుని విగ్రహం లేదా చిత్రాన్ని ఉంచుతారు. ఆ తర్వాత కుంభాన్ని పూజిస్తారు, తరువాత ధూపం, దీపాలు వెలిగించి పువ్వులు విష్ణువుకు సమర్పిస్తారు.ఈ ఆచారాలు,ఉపవాస నియమాలను పాటించడం ద్వారా, భక్తులు తమ ఆత్మలను శుద్ధి చేసుకోవడానికి మరియు ఆధ్యాత్మిక వృద్ధిని సాధించడానికి ప్రయత్నిస్తారు. భక్తి మరియు అంకితభావంతో, వారు ఉపవాసాలు పాటిస్తూ విష్ణువును పూజిస్తారు, ఈ ఏకాదశి పాటించడంలో ఒక కాలతీత కథ ఉంది. నీతిమంతుడైన మాంధాత రాజు తన రాజ్యం మూడు సంవత్సరాల కరువుతో బాధపడుతూ, ప్రజలు ఆకలితో ఇబ్బంది అలమటిస్తూ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నాడు. పరిష్కారం కనుగొనాలని నిశ్చయించుకున్న మాంధాత రాజు పవిత్ర పురుషుల నుండి జ్ఞానం కోసం ఒక ప్రయాణాన్ని ప్రారంభించాడు. చివరికి అతనికి మార్గదర్శకత్వం అందించినది అంగీర మహర్షి, దేవశయని ఏకాదశి నాడు విష్ణువును పూజించి,అత్యంత భక్తితో ఉపవాసం ఉండాలని రాజుకు సలహా ఇచ్చాడు.మాంధాత రాజు తన రాజ్యానికి తిరిగి వచ్చి తన ప్రజలతో కలిసి దేవశయని ఏకాదశి ఉపవాసం ఆచరించడం ప్రారంభించాడు. వారు విష్ణువును హృదయపూర్వకంగా పూజించడంతో, రాజ్యం యొక్క అదృష్టం మారడం ప్రారంభమైంది. వర్షాలు తిరిగి వచ్చాయి. వాటితో పాటు పంటలు సమృద్ధిగా పండి కరువు పోవడం వలన రాజ్యం మళ్ళీ అభివృద్ధి చెందింది. మాంధాత రాజు ప్రజలు సంతోషించారు. పురాణాల ప్రకారం, దేవశయని ఏకాదశి ఉపవాసం భక్తితో ఆచరించే వారికి శాంతి, ఆనందం, శ్రేయస్సు లభిస్తుంది. ఈ పవిత్ర రోజున విష్ణువును పూజించడం ద్వారా, భక్తులు జనన మరణ చక్రం నుండి విముక్తి పొంది,చివరికి మోక్షాన్ని పొందవచ్చు.

**- ఆళవందార్ వేణు మాధవ్**
8686051752

# అధర్మాన్ని సవాల్ చేసిన 'కర్బలా'



ప్రపంచ రాజకీయాలు అంగబలం, ఆర్థికబలం, అప్రజాస్వామికం, అధికార మాయాజాలం, బలవంతపు న్యాయం కలయికగా మారిపోతున్న ఈ కాలంలో, కర్బలా సంఘటన ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దంపడుతోంది. అది ఓ యుద్ధ ఘట్టమే కాదు. అసత్యానికి, అప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా జరిగిన ఓ సాహసోపేత తాత్విక ఉద్యమం. హజ్రత్ ఇమామె హుసైన్(ర)పోరాటం భౌతికరణమే కాక, చైతన్యం నింపిన మౌన విప్లవంగా చరిత్ర సృష్టించింది.

ఇమామె హుసైన్(ర)లక్ష్యం పదవీ సాధన కాదు. ఆయన పోరాటం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా, నిర్లిప్తంగా ఉన్న సమాజాన్ని చైతన్యపరచడం. ఇది నేటి మన దేశ రాజకీయాలకే కాదు, అంతర్జాతీయ రాజకీయాలకూ వర్తిస్తుంది. ప్రజాస్వామ్యం ముసుగులో, నియంతృత్వ విధానాలను అమలు చేసే ప్రభుత్వాలు పెరిగిపోతున్న సమయంలో, హజ్రత్ ఇమామె హుసైన్ (ర) లాంటి నైతిక శక్తి కలిగిన ధీరోదాత్తులు ధైర్యంగా ముందుకు రావడం నేటి సమాజానికి అవసరం.

కర్బలా సంఘటన ఒక నిత్యజీవిత నైతిక శిక్షణ. అధికారం లభించినంత మాత్రాన ధర్మానికి ధోకా లేదన్న భావన సరికాదు. హజ్రత్ ఇమామె హుసైన్(ర)భౌతికంగా ఓటమి చెందినా నైతికంగా ఆయన గెలిచారు. ఆయన దేహం గాయాలతో జల్లెడై పడి పోయినా, ఆయన ఆత్మ, ధర్మం కోసం, ప్రజాస్వామ్యం కోసం సజీవంగా నిలిచి ఉంది. శతాబ్దాలుగా జయగానం వినిపిస్తూనే ఉంది.

నేడు ప్రపంచంలో అనేక చోట్ల మైనారిటీలపై దాడులు, హక్కుల హననం జరుగుతోంది. రోజురోజుకూ ప్రభుత్వ నియంత్రణ, నిర్బంధాలు పెరిగి పోతున్నాయి. రాజ్యాంగ చట్టాలను ఉల్లంఘిస్తూ, అభిప్రాయ స్వేచ్ఛను ఖూనీ చేస్తుంటే, దానిపై నిరసన తెలిపే నైతిక ధైర్యం తగ్గిపోతోంది. అలాంటి సమయంలో కర్బలా సంఘటన



ప్రజాస్వామ్య సమరం ఎలా ఉండాలో చెప్పే చైతన్యవంతమైన మార్గదర్శకం.

లౌకిక దేశాలుగా పేరు గాంచిన ఎన్నో సమాజాలు, నేడు మత ఆధారిత రాజకీయం వైపు ప్రయాణిస్తున్నాయి. ఇలాంటి ప్రజాస్వామ్య దుర్వినియోగానికి ప్రత్యామ్నాయంగా హజ్రత్ హుసైన్(ర)స్థాపించిన ధర్మ ఆధారిత నైతిక పోరాటం ఒక మార్గదర్శకంగా నిలుస్తోంది. ఇదే మార్గం నేడు గాజా వీధుల్లో, ఫలస్తీనా ప్రజల శ్వాసలో వినిపిస్తోంది. వేలాది చిన్నారుల రక్త సిక్త దేహాల వెనక హక్కుల కోసం చేసిన ప్రతిఘటన ఉంది. పలస్తీనా ముస్లింల అర్తనాదాల్లోనూ, ప్రపంచం వహిస్తున్న మౌనంలోనూ, ఓ హుసైన్ (ర) ధైర్యం ప్రతిధ్వనిస్తోంది. హక్కుల కోసం గళమెత్తుతున్న పీడిత వర్గాలకు కర్బలా సంఘటన పోరాట స్ఫూర్తిగా నిలుస్తోంది.

అమెరికా నుండి అరబ్ దేశాలదాకా, భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశాల్లోనూ ప్రభుత్వ అధికార దుర్వినియోగాలు, మత రాజకీయం, జాతి ఆధిపత్య వ్యూహాలు ప్రజల మనసులను విభజిస్తున్నాయి. ఈ విభజనల మధ్య, హజ్రత్ హుసైన్ (ర) చూపించిన మార్గం 'అధర్మానికి తలవంచకూడదు, అసత్యానికి సహకరించకూడదు, ధర్మాన్ని తాకట్టు పెట్టకూడదు' అనే సందేశం నేడు మరింత ప్రాసంగికంగా మారుతోంది.

హజ్రత్ ఇమామె హుసైన్ (ర) పోరాటం ఆయుధాలతోకాదు, విలువలతో సాగింది. కర్బలా పోరులో శత్రుసైన్యం అస్త్ర శస్త్రాలతో సాయుధులై ఉన్నప్పటికీ, ఎటువంటి వనరులూ లేని ఇమామె హుసైన్ ఒంటరి పోరాటం వెనక విలువలే ఆయుధాలుగా నిలిచాయి. అవే ఆయనకు అమరత్వం అందించాయి. ప్రపంచం యజీద్లను కొంతకాలంపాటు తట్టుకోగలదేమో కాని, హుసైన్లను మాత్రం శాశ్వతంగా మర్చిపోలేదు. నియంతృత్వం, జులుం ఇలాగే కొనసాగితే, ప్రజల నిస్సహాయత మౌనం వహిస్తే, ఏదో ఒక రోజు, మరో హుసైన్(ర)లేచి నిలబడతాడు. నియతృత్వ యజీదులకు సవాల్ విసురుతాడు. ఇది చరిత్ర చెబుతున్న సత్యం.

కనుక కర్బలా సంఘటనను నేటి రాజకీయ నేతలు, సామాజిక కార్యకర్తలు, విద్యావంతులు, ప్రతి ఒక్కరూ ఒక నైతిక సంస్కారంగా చూడాలి. నైతిక విలువలు ఒక వ్యక్తితో మొదలై, సమాజాన్ని ఎలా ప్రభావితం చేయగలవో చెప్పే చరిత్ర కర్బలా. ఇది కేవలం మతానికీ, మూల్యాలకీ పరిమితం కాదు, ఇది ప్రజాస్వామ్యానికి తాత్విక మూలాధారం.

ఈ నేపథ్యంలో, కర్బలా ఒక మత సంఘటనగా కాక, ఒక ఆత్మశుద్ధి ప్రయాణంగా భావించాలి. అది తన ప్రయోజనం కోసం కాక, ప్రజాస్వామిక సమాజ పునర్నిర్మాణం కోసం చెలరేగిన విలువల సంచలనం. నేటి యువత, రాజకీయవేత్తలు, ధార్మిక పండితులు, నేతలు ఇమామె హుసైన్ (ర) నుండి స్ఫూర్తి పొందాల్సిన సమయమిది. సత్యపథానికే కాదు, సమానతా శక్తికీ, మానవ హక్కుల పరిరక్షణకీ ఇది మార్గదర్శకం. కాబట్టి, కర్బలాను స్మరించుకోవడం అంటే శోకించడం కాదు, మార్పును ప్రారంభించడం. నైతిక పోరాటాన్ని పునఃప్రారంభించడమే.

**- యండి. ఉస్మాన్ ఖాన్**
9912580645

# వేతన సంఘంపై కేంద్రం తాత్సారం



ఎనిమిదో వేతన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర సర్కారు ప్రకటించి ఆర్నెల్లు కావొస్తోంది. దీని సిఫార్సులు జనవరి 1, 2026 నుంచి అమలు కావల్సి ఉండగా దానికి ఇంతవరకూ అతీ గతీ లేదు. కమిటీకి ఛైర్మన్, సభ్యులను నియమించడం గాని, 'టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్' లను ఖరారు చేయడం గాని నేటికీ జరగలేదు. పదేళ్ళకోసారి ఏర్పాటయ్యే కేంద్ర వేతన సంఘాలు, సాధారణంగా వాటి గడువు తేదీకి ఒకటి రెండు సంవత్సరాలు ముందుగానే నియమించబడి కార్యకలాపాలు ప్రారంభిస్తాయి.

అలాంటిది 8వ పే కమిషన్ ఇంతవరకు రూపొందలేదంటే, అసలు దీని సిఫార్సులు జనవరి 2026లో అమలవుతాయో లేదో అనే సందేహం తలెత్తుతోంది.

మోదీ సర్కార్ కావాలనే కాలయాపన చేస్తోందోమో అనిపిస్తోంది. దీనికి తోడు ఆర్థికబిల్లు 2025లో కేంద్ర ఉద్యోగుల 'పెన్షన్ రూల్స్' ని సవరించే ఒక కొత్త అధ్యాయాన్ని చేర్చారు. తద్వారా పెన్షన్ సవరణలపై పే కమిషన్ సిఫార్సులను ఎప్పుడు, ఎలా అమలు చేయాలో నిర్ణయించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఈ పరిణామంతో లక్షలాది మంది పెన్షనర్లు ఆందోళన చెందుతున్నారు. వేతన సంఘాల సిఫార్సుల ఆధారంగా ఉద్యోగులకు, పెన్షనర్లకు న్యాయమైన జీతాలు, పెన్షన్లు చెల్లించడం ప్రభుత్వాల బాధ్యత. నేడు అధిక ధరలు, ద్రవ్యోల్బణాలతో జీవన వ్యయాలు పెరిగి అల్ప, మధ్యాదాయ ఉద్యోగులు, పెన్షనర్లు నానా ఇక్కట్లు పడుతున్నారు.ప్రభుత్వ ఉద్యోగులు దేశ అభివృద్ధి కోసం పనిచేస్తారు. వేతనాలు, పెన్షన్లను పెంచడం వలన వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి అంటూ ఎనిమిదో పే కమిషన్ ఏర్పాటు సందర్భంలో ప్రధాని మోదీ వక్కాణించా రు. కానీ వేతన సంఘం నియామకంలో జరుగుతున్న అమిత జాప్యం పలు అనుమానాలకు దారితీస్తోంది.

ప్రభుత్వం తెచ్చిన ఆర్థికబిల్లు సవరణతో పెన్షనర్ల మధ్య వివక్షత సృష్టించి కొత్తవారికి మాత్రమే వేతన సంఘం సిఫార్సులను వర్తింపచేస్తారేమో అని ప్రస్తుత పెన్షనర్లు భయాందోళనలు చెందుతున్నారు. కాబట్టి కేంద్రం కాలయాపన చేయకుండా 8వ వేతన సంఘానికి సభ్యులను నియమించి, దాని సిఫార్సులను ఎటువంటి వివక్షత లేకుండా జనవరి 2026లో అందరికీ అమల య్యేట్లు తక్షణ చర్యలు గైకొనాలి.

**- పి.వి.ప్రసాద్**
9440176824

# యుద్ధానికి అంతం లేదు

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం రోజు రోజుకు ఉధృతం అవుతోంది. ఈ యుద్ధం ఇలాగే దీర్ఘ కాలం కొన సాగిన ఆశ్చర్య పొనవసరం లేదు. శాంతికి కృషి చేయాలనే ఆలోచన ఏ దేశానికి లేదు. మొన్నటికి మొన్న రష్యా దాదాపు 400 పైనే డ్రోన్ ల దాడి చేసింది. ఇది రష్యా చరిత్రలోనే అతి పెద్ద దాడి. ఇంతకు మునుపు ఎప్పుడు రష్యా అలా చేసింది లేదు. ఉక్రెయిన్ కూడా కొన్నిటిని కూల్చేశామని చెబుతోంది. జరిగిన నష్టం రెండు దేశాలకు అపారం. నిజానికి అక్కడి పౌరులు బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. శాంతికి అడుగు పడకపోవడం శోచనీయం. ఇది ఇలా ఉంటే యుద్ధాన్ని మరో కోణం లోకి రష్యా తీసుకుపోవడం భయభ్రాంతులను చేస్తోంది. అదేమిటంటే తాజాగా రష్యాకు ఉత్తర కొరియా పూర్తిగా మద్దతు ఇస్తోంది. రష్యాకు సహకారాన్ని ఇస్తోంది.ఉక్రెయిన్ చెప్పినట్లు రష్యా, ఉత్తర కొరియా సైన్యాన్ని వినియోగిస్తోందని భోగట్టా. ఉత్తర కొరియా సేనలు రష్యాకు అండగా నిలబ డటం చూస్తే యుద్ధం ఇప్పట్లో ముగిసే లా లేదు. 30,000 వేల మంది ఉత్తర కొరియా సేనలు రష్యా సైన్యం లో చేరితే మాత్రం ఉక్రైన్ కొత్త చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ దిశలో రష్యా నేవీ చీఫ్ మిఖాయిల్ గుడకొవ్ హత్యకు కు గురి కావడం అనుమానాలకు తావిస్తోంది. ఇది ఉక్రెయిన్ పనే అయివుంటుందని రష్యా అను మానం. ఇలా ఒకరికొకరు రెచ్చి పోవడం చూస్తే యుద్ధం తీవ్రం అవుతుందని తెలుస్తోంది. శాంతి ని కాంక్షించాలని టర్కీ ప్రయత్నం విఫలం అయింది. ఇప్పుడు ఏ దేశం కూడా రష్యా, ఉక్రైన్ యుద్ధం ఆపటానికి ముందుకు రావడం లేదు. కారణం రెండు దేశాల నేతలకు శాంతి అనే మాట గిట్టడం లేదేమో అని పిస్తోంది. లేకపోతే యుద్ధం పురిట్లోనే ఆగిపోయి ఉండేది. యుద్ధాన్ని ఆపు తానన్న ట్రంప్ కూడా ఏమి చేయలేని స్థితి. రష్యా కు, ట్రంప్ గట్టిగా చెప్పలేడు. కారణం రష్యా, అమెరికా దేశాలు భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు. చెప్పినా రష్యా ఏ మేరకు వింటుందో లేదో అనే అనుమానం. ఉక్రెయిన్ కు మాత్రం అమెరికా తగిన సహాయం చేస్తోంది. యుద్ధం ఆగిపోవాలం టే ఉక్రెయిన్‌ను ట్రంప్ గట్టిగా హెచ్చరిస్తే ఆగిపో తుంది. మరి ఎందుకు ట్రంప్ ఉక్రెయిన్‌ను వారించ లేదో అర్థం కాలేదు. ఇప్పటికే రెండు దేశాలలో పర్యాటకులు లేరు. దానితో పర్యాటక రంగం కుదేలైయింది. ఆదాయం రెండు దేశాలకు తగ్గి పోయింది. రెండు దేశాలలో సుందరమైన ప్రదేశాలు ఉన్నాయి. దాడులతో అవి శిదిలావస్థ లో ఉన్నాయి. వాటి పునర్నిర్మానం బహు ఖర్చు తో కూడుకున్న పని. ఇప్పటికైనా నేతలు తమ పట్టు సడలించి దేశ ఔన్నత్యం కొరకు, ప్రజల కొరకు, అభివృద్ధి కొరకు సహాయం అందించు కుంటే ప్రజలు హర్షిస్తారు.కాని ఆ దిశలో ఈ దేశాలు ఆ పని చేయ వు. పైచేయి సాధించాలానే తలంపు ఉంటుం ది. కనుక రష్యా, ఉక్రెయిన్ యుద్ధం కు అంతం లేదు.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# విడాకులను ఆశ్రయిస్తున్న ఆధునిక జంటలు



కాలం మారుతోంది. టెక్నాలజీ కొత్తపుంతలు తొక్కుతోంది. డిజిటల్ మనుషుల ఆలోచన ధోరణి సైతం మారుతోంది. జీవనశైలిలో సమూల మార్పులు వస్తున్నాయి. చిత్ర విచిత్ర పోకడలు మొలుచుకొస్తున్నాయి. నేడు నిద్ర విడాకులు (స్లీప్ డైవర్స్) ట్రెండ్ నడుస్తోంది. నిద్ర విడాకులు లేదా స్లీప్ డైవర్స్ అనే ఆలోచనలు ఇటీవల బహుళ ప్రచారంలోకి వచ్చింది.

నిద్ర విడాకులు అనే పదం ఒక విషాదకర, అసౌకర్య సమస్యగా కనిపిస్తున్నది. నిద్ర విడాకులు అంటే జంట విడిపోవడం కాదు. మూడింట ఒక వంతు దంపతులు లేదా ప్రేమ భాగస్వాములు వేరు వేరు గదుల్లో లేదా వేరు వేరు పడకలపై నిద్రించడం, లేదా వేర్వేరు సమయాల్లో పడుకోవడం సాధారణంగా జరుగుతున్నట్లు గమనించారు. జీవిత భాగస్వాములు పలు కారణాలతో వేర్వేరు గదుల్లో పడుకోవడం లేదా ఒకే గదిలోని రెండు వేర్వేరు పడకలపై నిద్రించడాన్ని నిద్ర విడాకులు లేదా స్లీప్ డైవర్స్ అని నిర్వచిస్తున్నారు.

నిద్ర విడాకుల వల్ల కొన్ని జంటలకు ప్రయోజనం జరిగితే మరి కొన్ని జంటలు చివరికి మళ్లీ ఒకే మంచంలో నిద్రించడం జరుగుతుంది. నిద్ర విడాకుల వల్ల ఆయా పరిస్థితులను బట్టి లాభాలు, నష్టాలు కూడా ఉన్నాయి.

**నిద్ర విడాకులకు కారణాలు:**

నిద్ర అంతరాయాలను తగ్గించడానికి నిద్ర విడాకులు ఉపయోగపడతాయి. జంటలో ఒకరికి గురక అలవాటు (స్లీప్ అప్నియా), నిద్రలో మాట్లాడే స్వభావం, నిద్రలేమి, శ్వాస ఇబ్బందులు, వేరు వేరు సమయాల్లో నిద్ర పోయే ప్రణాళికలు, తల్లితండ్రులతో మాట్లాడడం, కాళ్ల కదలికలు, అర్ధరాత్రి వరకు టీవీ చూడడం లేదా సెల్ఫోన్ను వాడడం, నిద్రలో వస్తువులు విసరడం, గట్టిగా కౌగిలించుకోవడం, దిండు లేదా దుప్పటిని కౌగిలించుకోవడం, రాత్రి మూత్ర విసర్జనకు 2 లేదా 3 సార్లు లేవడం, భాగస్వామి నిద్రలో అసమానతలు, ఇద్దరిలో ఒకరు లైట్ వేసుకుందామని అనడం, ఇద్దరిలో ఒకరికి నిద్రలో లేచి నడిచే అలవాటు లాంటి కారణాలతో మరొకరు నిద్రకు దూరం కావడం లేదా నిద్ర భంగం కావడం జరుగుతుంది.

**నిద్ర విడాకుల వల్ల ప్రయోజనాలు:**

సందర్భాల్లో ఇద్దరు వేర్వేరు గదుల్లో అయినా లేదా ఒకే గదిలో వేర్వేరు పడకలపైన నిద్రిస్తే ఇద్దరికీ నిదురించే అవకాశం కలిగి ఆరోగ్య భాగ్యాలు సమకూరుతాయి. బెడ్



పార్టనర్ వల్ల కలిగే అంతరాయాలను నిద్ర విడాకులతో నివారించడం వల్ల 53 శాతం మందికి నిద్ర నాణ్యత పెరిగినట్లు తేలింది. నిద్ర విడాకులకు కట్టుబడి ఉన్న జంటల్లో కనీసం ఒక గంట వరకు నిద్రించే సమయం పెరిగినట్లు స్పష్టం అవుతున్నది. విడివిడిగా పడుకోవడం వల్ల నిద్ర మెరుగుపడడం, అలసట తగ్గడం ఫలితంగా ఆరోగ్యాలు కూడా కుదుట పడినట్లు తేలింది.

నిద్ర విడాకులను పాటించని యెడల నిద్రలేమి సమస్య ఉత్పన్నమై కోపం పెరగడం, జగడాలు పెరగడం, విభేదాలు ముదరడం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో తమ భాగస్వామిని కొట్టడం, తన్నడం, ఆకస్మిక హింసాత్మక చర్యలకు పూనుకోవడం జరిగే సందర్భాల్లో నిద్ర విడాకులు మాత్రమే ఉత్తమ మార్గంగా పాటించడం మంచిది.

**నిద్ర విడాకుల వల్ల నష్టాలు:**

నిద్ర విడాకులను పాటించడానికి రెండు విడివిడిగా గదులు ఉండాలి కాబట్టి డబుల్ బెడ్ రూం ఇళ్లు లేదా ఒకే గదిలో రెండు మంచాలు అవసరం అవుతూ ఖర్చులు పెరుగుతాయి. నిద్ర విడాకుల ఆలోచనలను పాటించడం వల్ల జంట మధ్య సాన్నిహిత్యం, లైంగిక జీవితంపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. నిద్ర విడాకులతో వేర్వేరు గదుల్లో పడుకోవడం వల్ల కొంత మందిలో ఒంటరితనం వల్ల నిద్రకు భంగం లేదా నిద్ర నాణ్యత తగ్గడం కూడా కలుగవచ్చు. ఇలాంటి సందర్భాల్లో తిరిగి ఇద్దరు ఒకే బ్బె పడుకొని మెరుగైన నిద్రను పోవచ్చు. కొంత మంది ఒంటరిగా పడుకోవడంతో అభద్రతకు, రాత్రిపూట భయానికి లోను కావచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఆరోగ్యాలు దెబ్బతింటాయి.

**నిద్ర విడాకుల సమస్యకు విరుగుడు:**

జీవిత భాగస్వామి అలవాట్ల వల్ల మీ నిద్రకు భంగం కలిగితే, మీ భాగస్వామితో నేరుగా చర్చించి నిద్ర విడాకులను పాటించవచ్చు. గురక వల్ల నిద్ర విడాకులు చేయాల్సి వస్తే వెంటనే డ్యాక్టర్ను సంప్రదించినగురక సమస్యకు పరిష్కారం వెతకవచ్చు. వేరు వేరు నిద్ర సమయాలు ఉన్న జంటలు తమ జీవనశైలినా మార్చుకొని ఇద్దరు ఒకే సమయంలో నిద్రకు ఉపక్రమించవచ్చు.

జంటలో ఒకరు లైట్ కావాలని అన్నపుడు మరో వ్యక్తి కంటికి ముసుగు ధరించవచ్చు. జంటలో ఒకరికి మెత్తటి పరుపు, మరొకరికి గట్టిగా ఉండే పరుపు కావాలన్నపుడు ఒకే మంచంలో రెండు వేర్వేరు పరుపులను కూడా వాడుకునే స్కాండినేవియన్ శైలిని పాటించవచ్చు. జంటలో ఒక్కరికి తన్నే లేదా కాళ్లు కదిపే అలవాటు ఉన్నట్లు అయితే ఒకే బెడ్‌పై పడుకుంటూ ఇద్దరి మధ్య దిండ్లు కూడా పెట్టుకోవచ్చు. నిద్ర విడాకులు పాటించడం అనే ఆలోచనలు నిరుత్సాహకరంగా అనిపించవచ్చు. ఇద్దరు ఒకే గదిలో పడుకొని సరైన సమయం నిద్ర పోని యెడల దీర్ఘకాలిక అనారోగ్యాలు కలగవచ్చు కాబట్టి దీనిని నిద్ర మెరుగుపడడం కోసం వాడుకోవడం మంచిది. రోజంతా కలిసి ఉంటూ నిదురించే సమయాల్లో విడాకులు తీసుకోవడం నేర్చుకొండి. మళ్లీ పరిస్థితులు మెరుగుపడితే తిరిగి ఒకే గదిలో ఒకే మంచంలో పడుకోవడం ఎప్పుడైనా మొదలు పెట్టవచ్చు. ఒకవేళ ఒకరికి గురక సమస్య ఎక్కువగా ఉంటే మరొకరి నిద్రకు తీవ్ర భంగం కలుగుతుంది. ఇలాంటి సందర్భాల్లో ఇద్దరూ చక్కగా చర్చించుకొని నిద్ర విడాకులను పాటించవచ్చు. నిద్ర విడాకులు బంధాలను దూరం చేయడానికి కాదని, బంధాలను ఆరోగ్యంగా కొనసాగించడానికని మరువరాదు.

**- డా. మధుసూదన్ రెడ్డి బుర్ర**
9949700037

# గణాంక శాస్త్ర పితామహుడు 'మహలనోబిస్'



ప్రస్తుత వేగవంతమైన యుగంలో మెరుగైన గణాంకాలు మెరుగైన జీవి తాలను అందిం చడా నికి అవసరం. గణాంకాలు అవసరం లేని రంగం ఏదైనా ఉందంటే అది శాస్త్రమే కాదని చెప్పొ చ్చు. ఒక రంగానికి సంబంధించిన ప్రస్తుత గణాంకాల సమాచార విశ్లేషణ ఆధారంగా భవిష్యత్తులో ఆ రం గంలో అవసరమైన అనేక పోకడలను ఊహిస్తాం. ఉదాహరణకు ఈ రోజున ఉన్న జనాభా సంఖ్యను బట్టి రాబోయే పదేళ్లలో అనేక విషయాలలో జనాభా తీరును అంచనా వేయగలుగుతున్నాం. దేశాల బడ్జెట్ తయారీకైనా, సంక్షేమరంగంలోనైనా, సేవారంగంలోనైనా ఇలా ఏ రంగంలోనైనా గణాం కాలు అవసరం. గణాంకాలు జాతీయ, అంతర్జాతీ యంగా ఆర్థిక, సామాజిక, విద్య, వైద్య, వ్యాపా ర, శాస్త్రీయ, వాతావరణ, స్టాక్ మార్కెట్, బ్యాంకింగ్, భీమా, బడ్జెట్, పర్యావరణం, ఆరోగ్యం, అంత రిక్షం లాంటి అనేక రంగాలలో పరిశోధనలను నిర్వహించడానికి, ఫలితాలను మూల్యాంకనం చేయడానికి, విమర్శనాత్మక ఆలోచనను అభివృద్ధి చేయడానికి, సమాచార నిర్ణయాలు తీసుకోవ డానికి, పరిశోధించడానికి, అధ్యయనం చేయ డానికి ఉపయోగ పడతాయి. ఇక పాలనలో గణాం కాలుచాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ విధానాలను ఎంచుకోవడానికి, పనులు ప్లాన్ చేసుకోవడానికి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఇవి ప్రాధాన్య తనిస్తాయి. వనరులను సమర్థవం తంగా వాడుకోగలం, సామాజిక-ఆర్థిక పథకాలను ప్రభావవంతంగా రూపొందించగలం. నిరుద్యోగం, ఆరోగ్యం, విద్య, వ్యవసాయ వృద్ధిని అంచనా వేయడానికి ఇవి అవసరం. దేశాభివృద్ధిని పర్య వేక్షించడానికి, అసమానతలను తగ్గించడా నికి, జనాభా లెక్కలు, జాతీయ సర్వేలు, జీడీపీ అంచ నాల వంటి అన్ని సర్వేలలోనూ గణాంకాలు ఒక సాధనంగా ఉపయోగపడతాయి. అన్ని రంగా లలో గణాంకాలు లేనిదే అభివృద్ధిని ఊహించ లేము. ఇటువంటి గణాంకాల ప్రాముఖ్యతను, అవస రాన్ని తెలియజేయడానికి మన దేశంలోని గొప్ప గణాంకవేత్తలలో ప్రముఖులు, భారతదేశంలో ఆధునిక గణాంక వ్యవస్థల పితామహుడు, గణాం కాలు, ఆర్థిక ప్రణాళిక రంగాల్లో విశేష కృషి చేసిన ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర భారత ప్రభుత్వం ఆయన చేసిన సేవలకు గాను పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందజేసింది. ఆయన జన్మదినాన్ని ప్రతి సంవత్సరం జాతీయ గణాంకాల దినోత్స వంగా మన భారత ప్రభుత్వం జరుపుతోంది. దేశంలో పరిశ్రమలు లేని కారణంగా నిరుద్యోగం తాండవించింది. దీనికి విరుగుడుగా నాటి ప్రధాని నెహ్రూ గారి ఆలోచనల నుండి పురుడు పోసు కొన్న పంచవర్ష ప్రణాళికల్లో భాగంగా రెండవ పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామికీకరణకు పెద్దపీట వేశారు. దాని రూపకల్పనలో కీలక పాత్ర పోషించినది ప్రశాంత్ చంద్ర మహలనోబిస్. ఈయన భారతీయ గణాంక సంస్థ స్థాపకుడు. భారత మొదటి ప్రణాళికా సంఘంలో సభ్యుడు కూడా. మహల నోబిస్ అప్పటి బెంగాల్ ప్రెసిడెన్సీ విక్రంపూర్‌లో జన్మించారు. కలకత్తా విశ్వవిద్యా లయంలో ప్రముఖ శాస్త్రవేత్తలు జగదీష్ చంద్ర బోస్, ప్రఫుల్ చంద్రరాయ్ వంటి వారు ఇతనికి గురువులు. 1912లో భౌతిశాస్త్రంలో పట్టా పొంది, లండన్ కేంబ్రిడ్జ్ కింగ్స్ కళాశాలలో ఉన్నతవిద్యను అభ్యసించారు. అక్కడ నుండి మనదేశానికి తిరిగి వచ్చి 1932లో భారతీయ గణాంక సంస్థను (ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్)ని స్థాపిం చారు. 1950లో విధాన ప్రయోజనాల కోసం సామాజిక ఆర్థిక డేటాను సేకరించడానికి ఆయన నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్)ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాదిలోనే మొదటి డిజిటల్ కంప్యూ టర్ తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారు. దీన్ని బట్టి చూస్తే ఆయన గణాంక రంగంలో ఎంత ముందు చూపు ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. గణాంక రంగంలో ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. అందుకే ఆయనను భారతీయ గణాంక పితామహుడని పిలుస్తారు. భారతీయ గణాంక సంస్థకు కార్యదర్శిగా, భారత ప్రభుత్వ కేబినేటుకి గణాంక సలహాదారుడు గాను పనిచేశారు. ఆయన ఆవిష్కరించిన 'మహాలనోబిస్ డిస్టెన్స్' పద్ధతి అనేది గణాంక డేటా విశ్లేషణలో అత్యంత ప్రజాదరణ పొందిన కొలమానాలలో ఒకటి. గణాంక విశ్లేషణలో నమూనా పద్ధతుల ప్రాముఖ్యతను సూచించే పైలట్ సర్వేలను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించారు.

మనదేశంలో గణాంకశాస్త్ర రంగంలో పరిశోధన అభివృద్ధి సంస్థలు తక్కువగా ఉన్నాయి. జాతీయ గణాంక విద్యా సంస్థలు ఎక్కువగా లేవు. ఈ శాస్త్రాన్ని అభ్యసించిన వారికి మనదేశంలో ఉపాధి



అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. ఈ కారణం చేతఎక్కువ మంది విద్యార్థులు ఎక్కువమంది ఈ కోర్సులలో ప్రవేశం పొందడం లేదు. ప్రభుత్వం మరిన్ని జాతీయ విద్యా సంస్థలు నెలకొల్పవలసిన అవసరం ఉంది. బడ్జెట్లో ఈ రంగానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

## ఉపాధి హామీ నిధులను వెంటనే విడుదల చేస్తాం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ



**పెనమలూరు, జూలై 5(మనం న్యూస్):** జాతీయ ఉపాధి హామీ (నరేగా) నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల, సర్పంచులు, ఎంపీటీసీల ,జడ్పిటిసిల, ఎంపీపీల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతి పత్రం అందజేసినట్లు శనివారం పంచాయతి రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ నాడు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం నరేగా నిధులను తక్షణమే విడుదల చేయాలని అక్కడే ఉన్న అధికారులకు ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా త్వరలోనే విడుదల చేస్తామని సిఎం హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో పాటు గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రజా ప్రతినిధులయిన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎంపీపీల సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనతో చెప్పారని రాజేంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితురాలికి రూ.45 లక్షల పరిహారం

- ప్రకటించిన గుడివాడ 11వ జిల్లా న్యాయస్థానం



**గుడివాడ, జూలై 5(మనం న్యూస్):** గుడివాడ 11వ జిల్లా కోర్ట్ న్యాయమూర్తి జి సుబ్రమణ్యం గుడివాడలో జరిగిన కళ్యాణపు చంద్రావతి అనే వ్యాపారవేత్త గుడివాడ బైపాస్ రోడ్డు కృష్ణాజిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వారు బలమైనటువంటి తీవ్రమైన గాయాల పాలయిన కేసులో క్రైమ్ నెంబర్ 3/2022 గుడివాడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి నష్టపరిహారం కొరకు గుడివాడ 11వ జిల్లా కోర్టులో, కేసు దాఖలు చేయగా శనివారం నాడు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వారు ఈ కేసులో రాజీకి వచ్చి రీజినల్ మేనేజర్ విశాఖపట్నం వారు ఫణి, విజయవాడలో ఉన్న లీగల్ ఆఫీసర్ అపర్ణ, వారి తరపున కంపెనీ వారు కేశవరావు పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావు, జి.సుబ్రమణ్యం 11వ జిల్లా కోర్టు న్యాయమూర్తి గుడివాడ వారి చేతుల మీదుగా రోడ్డు ప్రమాదంలో నష్టపోయిన బాధితురాలు కళ్యాణపు చంద్రావతికి రూ.45 లక్షల పరిహారాన్ని అందించారు. శనివారం నాడు గుడివాడలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో ఈ కేసులో ఇన్సూరెన్స్ కంపెవారు బాధితురాలితో రాజీ చేసుకుని పరిహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆమె తరపున న్యాయవాది నరహరిశెట్టి నరసింహారావు, యునైటెడ్ ఇండియా కంపెనీ తరపున న్యాయవాది కేశవరావు, సీనియర్ న్యాయవాది కండెల వరప్రసాద్, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్విమ్మర్ తులసీ చైతన్య బృందానికి దేవినేని అభినందనలు



**విజయవాడ రూరల్, జూలై 05 (మనం న్యూస్)** ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగానికి చెందిన ప్రముఖ స్విమ్మర్ ఎం. తులసీ చైతన్య, తన శిష్యులతో కలిసి టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును గొల్లపూడిలో శనివారం నాడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తులసీ చైతన్య శిక్షణలోని యువ స్విమ్మర్లు నర్సరీ విభాగం నుండి ఆర్య నిఖీ, ఫస్ట్ క్లాస్ నుండి నాగసాయి ఆశ్రిత్, 6వ తరగతి నుండి రాజీవ్లు జూలై మూడో వారంలో ఆస్ట్రియా నుండి జర్మనీ వరకు 5 కిలోమీటర్ల దూరం ఈత సవాలును స్వీకరించనున్నారు. ఈ అసాధారణ సాహసం కోసం వారికి దేవినేని ఉమామహేశ్వరరావు తన అభినందనలు తెలిపారు. తులసీ చైతన్య గతంలో 2022లో రాష్ట్రపతి చేతులమీదుగా ప్రతిష్ఠాత్మక టెంజింగ్ నార్గే నేషనల్ అడ్వేంచర్ అవార్డును అందుకున్న విషయం గమనార్హం. తులసీ చైతన్య శిక్షణలోని ఈ యువ స్విమ్మర్లు తమ ప్రతిభ, సాహసంతో రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారు. వారి ఈ అంతర్జాతీయ సవాలు విజయవంతం కావాలని, వారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిద్దామన్నారు. తులసీ చైతన్య బృందానికి ప్రత్యేకంగా దేవినేని ఉమా అభినందనలు తెలిపారు.

# దార్శనిక ప్రణాళికలతో స్వర్ణాంధ్ర సాకారానికి గట్టి పునాదులు

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జిల్లా దార్శనిక ప్రణాళిక యూనిట్ చైర్మన్ సత్య కుమార్ యాదవ్



**విజయవాడ సెంట్రల్, జూలై 5(మనం న్యూస్):** వికసిత్ భారత్లో స్వర్ణాంధ్రకు కీలకభాగస్వామ్యం లక్ష్యంగా అందుబాటులో ఉన్న వనరులు, బలాలు, సవాళ్లు ఆధారంగా ఎన్టీఆర్ జిల్లా, నియోజకవర్గాల దార్శిక కార్యాచరణ ప్రణాళికల ముసాయిదాలను తయారు చేశామని.. 2047 నాటికి రూ. 18.23 లక్షల కోట్ల జీడీడీపీని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు జిల్లా ఇన్ఛార్జ్ మంత్రి, జిల్లా దార్శనిక కార్యాచరణ ప్రణాళిక యూనిట్ ఛైర్మన్ సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం ఇన్ఛార్జ్ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలు, స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేష్న కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), గద్దె రామ్మోహన్, కొలికపూడి శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్, కేడీసీసీ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు. జిల్లా ప్రణాళికపై కలెక్టర్ లక్ష్మీశ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రణాళికలను ఆయా నియోజక వర్గాల ప్రత్యేక అధికారులు వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో వృద్ధికి అవకాశమున్న అంశాలు, కీలక ప్రగతి సూచికలు, పర్యాటక రంగ అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్పీవోలు), వ్యవసాయ యాంత్రీకరణ తదితరాలపై చర్చించి, ప్రణాళికల్లో చేర్చాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో సగటున 18.5 శాతం వార్షిక వృద్ధి సాధనకు కార్యాచరణపై సూచనలు చేశారు. అనంతరం, మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ సుపరిపాలనలో కీలక అధ్యాయం పీ4 అని.. స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికల రూపకల్పన జరిగిందని, వీటిని సరైన కార్యాచరణతో అమలు చేసేందుకు ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2023-24లో జిల్లా తలసరి ఆదాయం రూ. 3,21,651 కాగా, దీన్ని 2028-29 నాటికి రూ. 6,38,946కు, 2047-48 నాటికి రూ. 62,88,851కు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వివరించారు. నియోజకవర్గాల స్థూల ఉత్పత్తి, విలువ జోడింపులను పెంచడం ద్వారా జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని.. ఇది స్వర్ణాంధ్రకు దోహదపడుతుందన్న ఉద్దేశంతో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గాల దార్శనిక ప్రణాళిక యూనిట్లను గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. స్వల్ప, మాధ్యమిక, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం జరిగిందని, వాటిని చేరుకునేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, అభివృద్ధి ఆకాంక్షితులు సమన్వయంతో పనిచేయనున్నట్లు వివరించారు. క్వాంటం వ్యాలీ అనుబంధ కార్యకలాపాలతో పాటు ఆధ్యాత్మిక, ఎకో, నదీ పర్యాటకంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేసుకుంటూ, సద్వినియోగం చేసుకొని లక్ష్యాల సాధనకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ఇది తొలి అడుగు మాత్రమేనని.. ప్రగతిపై నిరంతర మదింపు ఉంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ యువత సుస్థిర ఉపాధి అవకాశాలు పొందేందుకు నైపుణ్యాభివృద్ధి కీలకమని.. ఆటోనగర్లో ఆటోమొబైల్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చాలా ముఖ్యమని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నగరంలో కొత్తగా వివిధ ప్రాంతాల్లో ఈట్ స్ట్రీట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు దిశగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. పీఎం ఎఫ్ఎంఈ, పీఎం ప్రణమ్ వంటి వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా వృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విజయవాడలో సేవారంగ అభివృద్ధికి పుష్కల అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

సమావేశంలో సీపీవో వై.శ్రీలత, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళిక యూనిట్ల ప్రత్యేక అధికారులు డి.చంద్రశేఖర్, డీఎంఎఫ్ విజయకుమారి, ఎ.రవీంద్రరావు. డా. ఎం.హనుమంతరావు, పి.బాలాజీకుమార్, జి.మహేశ్వరరావు, టి.వెంకట సతీష్తో పాటు వివిధ శాఖల అధికారులు, విద్యారంగ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై సారె సమర్పణ బృందాల కోలాహలం



విజయవాడ పశ్చిమ, జూలై 05 (మనం న్యూస్) అమ్మలగన్నయమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ, కనకదుర్గమ్మకు ఆషాడ సారెను సమర్పించేందుకు తరలివచ్చిన భక్త బృందాలతో ఇంద్రకీలాద్రి కోలాహలంగా మారింది. ఆషాఢ సారె సమర్పణకు తరలి వచ్చిన వందలాది బృందాలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషఆడ సారెను సమర్పించారు. కేవలం సారె తీసుకు వచ్చిన భక్తులే ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 వరకు సుమారు 10 నుండి 15 వేల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. మహా మండపం లో భక్త బృందాలతో మాట్లాడిన కార్యనిర్వాహణాధికారి శీనానాయక్ దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాల గురించి వారి స్పందన తెలుసుకున్నారు. అమ్మవారికి కొందరు భక్తులు సమర్పించిన మిఠాయి రోలు, రోకలి, సన్నికల్లు, పంచదార చిలుకలు అక్కడున్న భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం సందర్భంగా పెద్ద సంఖ్యలో విచ్చేసిన సారె బృందాలకోసం లిఫ్ట్ మార్గం, దర్శనం మార్గాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం నాడు మహా మండపం భక్తులతో కిక్కిరిసింది.

## సామాజిక న్యాయం.. తెలుగు దేశం పార్టీ ధ్యేయం

- తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



**విజయవాడ తూర్పు, జూలై 5(మనం న్యూస్):** తెలుగు దేశం పార్టీ సామాజిక న్యాయం అమలు చేయటంలో ఎప్పుడు ముందు ఉంటుందని, తెలుగు దేశం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగానే తిరువూరు నగరంలో 20 వార్డుల్లో, మూడు మండలాల్లో 55 గ్రామాల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోవటం జరిగిందని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. గురునానక్ కాలనీలోని ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు సుఖవాసి శ్రీనివాసరావు, సంస్థాగత ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు గన్నే ప్రసాద్ (అన్న)లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో తిరువూరు పట్టణ, తిరువూరు రూరల్ మండలం, గంపలగూడెం మండలం, విసన్నపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎన్నుకున్న వారి పేర్లు ప్రకటించారు. తిరువూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా మల్లెల శ్రీనివాసరావు, తిరువూరు రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా దుబ్బాక వెంకటేశ్వర్లు, గంపలగూడెం మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడిగా మానికొండ రామకృష్ణ (ఎం.ఆర్.కె), విసన్నపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా రాయల సుబ్బారావులను ఎన్నుకొన్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా దాదాపు గత రెండు నెలలుగా తిరువూరు నియోజకవర్గ స్థాయిలో నియోజకవర్గ అబ్జర్వర్ సుఖవాసి శ్రీనివాసరావు నాయకత్వంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో 96 గ్రామాల్లో గ్రామ కమిటీల కోసం సమావేశాలు నిర్వహించటం జరిగిందన్నారు.. పోటీ వున్న చోట మెజార్టీ అభిప్రాయం ప్రకారం, పోటీలేని చోట ఏకగ్రీవంగా పట్టణ, మండల, గ్రామ కమిటీలు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోవటం జరిగిందని తెలిపారు. కొత్తగా ఎన్నికైన మండలాధ్యక్షులు పార్టీని బలోపేతం చేయటంతో కృషి చేయాలని ఆకాంక్షిస్తూ.. అందరికీ అభినందనలు తెలిపారు. గన్నె ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని అనుసరించి టిడిపి సంస్థాగత ఎన్నిక ప్రక్రియ జరిగిందన్నారు. రాబోయే స్థానిక సంస్థాగత ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థాగత ఎన్నికల రాష్ట్ర పరిశీలకుడు నవనీతం సాంబశివరావు, సంస్థాగత ఎన్నికల పరిశీలకులు రామినేని రాజశేఖర్ , ఎస్.ఎమ్.ఫైజాన్ , వల్లూరి మధుసూధనరావు, ఏచూరి రాము పాల్గొన్నారు.

## దుర్గమ్మ సన్నిధి అన్నదాన పథకానికి లక్ష




**విజయవాడ పశ్చిమ, జూలై 05(మనం న్యూస్)** విజయవాడ ఇంద్రకీలాద్రిపైన వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం వితరణ నిమిత్తం గుంటూరు కు చెందిన ఆవుల శ్రీ కమల్ రూ. 1లక్ష 116 రూపాయలు అన్నదానం నిమిత్తం విరాళం ఇచ్చారు. నగదు చెక్కును శనివారం నాడు దుర్గమ్మ ఆలయ కార్య నిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ కు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు, కుటుంబీకులకు అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.


## ధాన్యానికి గిట్టుబాటు ధర.. కూటమి ప్రభుత్వ ఘనతే...

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా



**పామర్రు, జూలై 5(మనం న్యూస్):** రైతు పండించిన దాన్యానికి గిట్టుబాటు ధర కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని పామర్రు నియోజకవర్గం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. శనివారం నాడు ఆయన తోట్లవల్లూరు మండలం గురువిందపల్లి గ్రామం పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులతో కలిసి వరి నాట్లు నాటారు. ఈ సందర్భంగా రైతు కూలీలు పలు సమస్యలను ఎమ్మెల్యే కుమార్ రాజా దృష్టికి తీసుకువచ్చారు. వీలైనం త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతులకు న్యాయం చేయడం కోసం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తునరారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు తాను గ్రామాల్లోని రైతులు, రైతు కూలీల సమస్యలు తెలుసుకునేందుకు ప్రతీ గడపకు, ప్రతీ పొలానికి వెళ్లి రైతుల సమస్యల గురించి అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిడిపి, జనసే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో హైకోర్ట్ జడ్జి



**అవనిగడ్డ, జూలై 5, మనం న్యూస్:** కృష్ణాజిల్లా, మోపిదేవి మండలం, మోపిదేవి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జి కె .శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన హైకోర్ట్ జడ్జి కె .శ్రీనివాస్ రెడ్డి గారికి దేవస్థానం ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు గారు, వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా శ్రీనివాస్ రెడ్డి నాగ పుట్టలో పాలు పోసి మొక్కుబడ్లు చెల్లించుకున్నారు అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు వేద పండితులు దేవస్థానం ఆలయ డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్ట్ జడ్జి కె .శ్రీనివాస్ రెడ్డికి పట్టు వస్త్రాలు తోపాటు శ్రీ స్వామి వారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు.

## జంతువులతో వచ్చే వ్యాధులపై అప్రమత్తం



**విజయవాడ సెంట్రల్ జూలై 05(మనం న్యూస్):** ఆదివారం నాడు ప్రపంచ జునోసిస్ దినం సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ, పశుసంవర్ధక శాఖ, ఎన్టీఆర్ జిల్లా, జీవకారుణ్య సంస్థ, భవానీపురం, సాయి బాబా సత్సంగ సేవ సమితి మరియు నవోదయ వేట్ సొసైటీ వారి సంయుక్త నిర్వహణలో నగరంలోని కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటరు, కె బి య న్ కాలేజ్ దగ్గర ఉదయం 7గంటలనుండి మధ్యాహ్నం 12 గంటలవరకు మరియు భవానీపురం ఐరన్ యార్డులోని జీవకారుణ్యం ఆశ్రమం, ఐరన్ కాంప్లెక్స్ వద్ద ఉదయము 9 గంటలు నుండి మధ్యాహ్నం 12 గంట వరకు వీధి కుక్కలకు మరియు పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం శనివారం నాడు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను జూనోసిస్ అంటారని, రేబీస్, బర్డ్ ఫ్లూ, నిపా, బ్రూసెల్లోసిస్, లీప్టోస్పిరాసిస్ వాటికి ఉదాహరణలని, ప్రాణాంతక వ్యాధులైన ర్యాబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రజలకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ర్యాబిస్ వ్యాక్సిన్ మొట్ట మొదటిగా 1885లో జులై 6న లూయిస్ పాశ్చర్ సైంటిస్ట్ మనుషుల్లో తొమ్మిదేళ్ల బాలుడిపై ప్రయోగించి ఘన విజయం సాధించారన్నారు. ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## బెజవాడలో విద్యుత్ చార్జీలపై మిన్నంటిన నిరసనలు




**విజయవాడ సెంట్రల్, జూలై 5(మనం న్యూస్):** విజయవాడలో విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజలపై మరో భారాన్ని మోపడంతో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు వెలువెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ప్రజలు రోడ్లపైకి వచ్చి విద్యుత్ చార్జీలు తగ్గించాలని పెద్దఎత్తున డిమాండ్ చేశారని సిపిఐ పార్టీ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, పెంచిన ట్రూ ఆప్ చార్జీలు తగ్గించాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని విరమించుకోవాలని, నెల్లూరు జిల్లా కడేరు గ్రామంలో ఇండోసోల్ కంపెనీకి రైతుల భూములను అప్పగించవద్దంటూ సీపీఐ ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ నగర సమితి ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన విద్యుత్ చార్జీలు పెంపుపై నిరసనను దిగారు. ఈ నిరసనకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు చార్జీల పెంపుపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంచమని అధికారంలో లేనప్పుడు ప్రజలకు హామీ ఇచ్చి...అధికారంలోకి వచ్చి ఏకంగా రూ.15,400కోట్లు ప్రజలపై భారాన్ని మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా గతంలో పెద్దఎత్తున ప్రచారం చేసి. ఎవరైనా స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలు గొట్టండని పిలుపు ఇచ్చి నేడు వాటిని బిగించుకోమని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. అదానితో ఈ ప్రాజెక్టు ఒప్పందంపై నాడు మీతో పాటు వామపక్షాల పార్టీతో కలిసి వ్యతిరేకించామని, తెలుగుదేశం పార్టీ కోర్టులో కేసు కూడా వేయడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా అదానితో జరిపిన ఒప్పందాన్ని రద్దు చేయకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగదారులపై దాదాపుగా లక్షా 10వేలు కోట్లు అదనపు భారాన్ని మోపారని, ఏకంగా 20 సంవత్సరాల పాటు విపరీతంగా చార్జీలు పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత జగన్మోహన్రెడ్డి మాదిరిగా అదానీతో చంద్రబాబు కుమ్మక్క అయ్యారని విమర్శించారు. గతంలో వేసిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను కూటమి ప్రభుత్వం ప్రజలపై ఆ మొత్తాన్ని వసూవులు చేసే పని పెట్టుకుందని పెంచిన చార్జీలను తక్షణమే ఉపహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాబోవు రోజుల్లో స్మార్ట్మీర్లు ఏర్పాటు చేయకుండా వామపక్షపార్టీలు పోరాటాలు చేస్తాయని ప్రకటించారు. వేలకోట్లాది రూపాయిలు వసూవులు చేసే ఈ విధానాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనలో నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, నగర నాయకులు బుట్టి రాయప్ప, కె.వి. భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ తదితరులతో కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేతనాలు పెంచాలని ఆందోళన




**విజయవాడ సెంట్రల్, జూలై 05 (మనం న్యూస్):** రాజధాని అమరావతి లోని పారిశుద్ధ్య కార్మికులకు ఇతర పట్టణాలతో సమానంగా వేతనాలు పెంచాలని కోరుతూ సిఐటియు అద్వర్యంలో శనివారం నాడు వారు విజయవాడలోని సిఆర్డిఎ కార్యాలయం ఎదుట ఆంధోళనకు దిగారు. వేతనాలు పెంచాలనే డిమాండ్ తో పాటు రద్దు చేసిన రాజధాని పెన్షన్ పునరుద్ధరించి ఇవ్వాలని కార్మికులు కోరారు. అనంతరం వారు సిఆర్ డిఎ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో కార్మిక సంఘాల నేతలు సిహెచ్. బాబురావు, ఎం రవి ,లక్ష్మణ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాజధానిని మూడు ముక్కలుగా విభజించిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రూ.42,000 కోట్లతో రాజధాని అభివృద్ధి కోసం టెండర్లు పిలిచామని ప్రకటించిందన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు తమ వ్యవసాయ భూములను కోల్పోయారనితెలిపారు. త్యాగానికి ఇచ్చిన తగిన ప్రతిఫలం ఇదేనా అంటూ ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడమే కాకుండా, పీఎఫ్ కూడా అమలు చేయకుండా పెండింగ్లో ఉంచారని మండిపడ్డారు. ఈఎస్ఐ సదుపాయాలను కూడా అరకొరగా అమలు చేస్తున్నారని అన్నారు. గతంలో ఐదు వేల పెన్షన్ అందజేసేవారు, అయితే గత ప్రభుత్వం వాటిని నిలిపివేసిందన్నారు. ఎన్నికల ముందు పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని మరిచిపోయిందన్నారు. పారిశుధ్య కార్మికుల జీతాలు పెంచాలి, పెన్షన్ మళ్లీ ఇవ్వాలి, పీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో కూడా కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందన్నారు. కార్మికుల ఆందోళనకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తోందని స్పష్టం చేవారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే నేరుగా సచివాలయం వద్ద ధర్నాకు దిగుతామని హెచ్చరిస్తున్నామన్నారు.

## స్మార్ట్ మీటర్లు ను తొలగించాలని సిపిఐ ధర్నా




**శ్రీకాళహస్తి,జులై 05,మనం న్యూస్:** స్మార్ట్ మీటర్లు ను తొలగించాలనికోరుతూ స్థానిక ఏడి కార్యాలయం ముందు శనివారం సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లు లను తొలగించాలని, ఆదానితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని ఒక యూనిట్ కరెంటు చార్జీలు ఒక్క రూపాయికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ను తొలగించుకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై మరో విద్యుత్ ఉద్యమం తప్పదన్నారు ధర్నా అనంతరం ఏ డి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, రూరల్ మండల కార్యదర్శి మించిల శివకుమార్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షురాలు చారులత స్ట్రీట్ వండర్ యూనియన్ నాయకులు మేక జనార్ధన్, రైతు సంఘం నాయకులు మల్లీయ్య, పార్టీ నాయకులు నరసయ్య, రమేష్, ముని, మస్తాన్, ఆటో యూనియన్ నాయకులు తమీం, మహిళా సంఘం నాయకులు మునెమ్మ, గంగమ్మ, సుబ్బారత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్లను అశ్రద్ధ చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం ఏర్పడుతుంది

- ఎస్పీ రాజేష్ చంద్ర




**కామారెడ్డి క్రైమ్, జూలై 05 ( మనం న్యూస్ ):** ఫోన్లను అశ్రద్ధ చేస్తే వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం ఏర్పడుతుందని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. పట్టణంలో శనివారం పోలీస్ కార్యాలయంలో మాట్లాడారు. బాధితులు పోగొట్టుకున్న సుమారు 130 ఫోన్లను రికవరీ చేశామని, త్వరలోనే బాధితులకు అప్పగిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ., నిత్యం మనం ఉపయోగించే మొబైల్ ఫోన్లపై అశ్రద్ధ మంచిది కాదన్నారు. మొబైల్ రికవరీలలో రాష్ట్రంలోని జిల్లాలలో కమిషనరేట్లను మినహాయిస్తే కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మొబైల్ పోయినా, చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోయిన సెల్‌ఫోన్ల రికవరీ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. 15 రోజుల్లో ఈ టీం 130 ఫోన్లను రికవరీ చేశారన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబర్చిన టీం సభ్యులను ఎస్పీ అభినందించారు. రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు అందజేస్తామని, బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి సంబంధిత వివరాలు చూపించి ఫోన్లు తీసుకుని వెళ్లాలని సూచించారు.

## గ్రామాల్లో సంక్షేమం అభివృద్ధి పరుగులు పెట్టిస్తాం

- రాష్ట్ర మంత్రి టి.జి భరత్
- వలసలు నివారించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది
- మంత్రాలయం నియోజకవర్గం కోల్మానిపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టి.జి భరత్
- ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించిన మంత్రి టి.జి భరత్



**కర్నూలు జులై 05 మనం న్యూస్:** తమ ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి మండలంలోని కోల్మాన్ పేట గ్రామంలో టిడిపి ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి తో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఏ ఏ పథకాలు అందాయని ఆయన మహిళలను అడగగా తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందాయని వారు తెలిపారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం డబ్బులు అందడంతో ఎంతో సంతోషంగా ఉందని వారు చెప్పారు. మంత్రి టీజీ భరత్ విద్యార్థులతో మాట్లాడిన సమయంలో టీచర్ల కొరత ఉందని విద్యార్థులు చెప్పారు. డీఎస్సీ రిక్రూట్మెంట్ జరుగుతుందని త్వరలోనే టీచర్ల కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని టీజీ భరత్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఆదోని, ఆలూరు హాస్పిటల్స్ లో మందులు సక్రమంగా అందేలా చూడాలని పలువురు గ్రామస్తులు మంత్రికి తెలుపగా ఈ సమస్యను తీర్చేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు. అనంతరం మరో వీధిలో మహిళలు, వృద్ధులతో మాట్లాడి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని ఆయన చెప్పారు. చిన్నచిన్న సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు తమకు చెబుతున్నారని వీటి ద్వారా వెంటనే పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వం ఎం ఎస్ ఎం ఈ పార్కులు ఏర్పాటు చేస్తుందని చెప్పారు. మంత్రాలయం నియోజకవర్గంలో ఈ పార్కు ఏర్పాటు చేసి వలసలు నివారించేందుకు కృషి చేస్తామన్నారు. మంత్రి నారా లోకేష్ విద్యా శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఏపీలో విద్యావ్యవస్థ ఉండేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. హామీ ఇచ్చిన విధంగా త్వరలోనే రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది అన్నారు. హామీ ఇచ్చిన విధంగా ఉచిత బస్సు పథకం కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, తదితర సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూలై 1 నుండి అక్టోబర్ 15 వరకు ఇసుక రవాణా నిషిద్ధం



- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి కలెక్టరేట్,జూలై 05,మనం న్యూస్:** భారత ప్రభుత్వం, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారు నదులలో ఇసుక త్రవ్వకం, రవాణా కి సంభందించి కొన్ని మార్గదర్శకాలను జారీ చేసినట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో జూన్ 1 నుండి అక్టోబర్ 15 వరకు నదులలో ఇసుక త్రవ్వకం, రవాణా పూర్తిగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులు, అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు మార్గదర్శకాల ప్రకారం వర్షాకాలంలో నదులలో ఇసుక త్రవ్వకం, రవాణాకి అనుమతించకూడదని భారతదేశంలో నైరుతి రుతుపవనాల ప్రారంభం వలన జూన్ 1 నుండి అక్టోబర్ 15 వరకు వర్షాకాలంలో స్వర్ణముఖి, అరనియార్ నదులలో ఇసుక తవ్వకాలు నిషేధించినట్లు వీటిపై పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా కలెక్టర్, స్థానిక రెవిన్యూ, పోలీస్, మైనింగ్, ఇరిగేషన్ డిపార్టుమెంటుల వారికీ అప్పగించడం జరిగినదని తెలిపారు. వర్షాకాలంలో గూడలి స్వర్ణముఖి బేరేజీ డీ-సిల్టేషన్ యార్డులు, ఆవిలాల తిరుపతి యార్డు, కాటన్ మిల్ తిరుపతి యార్డు, గాజులమాండ్యం రేణిగుంట యార్డు, శ్రీకాళహస్తియార్డు, వెంకటగిరి యార్డు, అధీకృత స్టాక్ పాయింట్లులలో ప్రభుత్వం వారు నిర్ణయించిన లోడింగ్ చార్జీలు చెల్లించి, కావలసిన పరిమాణంలో ఇసుకను తెచ్చుకొనవచ్చునని లేదా గ్రామ పంచాయతీ పరిధి లో స్థానిక వినియోగదారులువాగులు, వంకలు, కాలువల తమ అవసరాల నిమిత్తం గ్రామ సచివాలయం నందు దరఖాస్తు చేసుకొని, లేదా ఇసుక పోర్టల్ నుండి నమోదు చేసుకొని, యంత్రములు ఉపయోగించకుండా ఇసుకను మనసుల ద్వారా త్రవ్వకము జరిపి టైరు బండ్లు, ట్రాక్టర్ల ద్వారా రసీదుతో ఉచితముగా తెచ్చుకొనవచ్చునని తెలిపారు. ఇసుకను గ్రామములోని నిర్మాణ అవసరములకు మాత్రమే ఉపయోగించాలని, బయట ప్రాంతాలకు రవాణా చేయకూడదని అలా చేసినట్లయితే అక్రమ ఇసుక రవాణా వాహనదారులు, వినియోగదారులపై చర్యలు తీసుకొని వాహనాలు స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

### జాతీయం- అంతర్జాతీయం

## పీఎన్‌బీ కుంభకోణం..

### అమెరికాలో నీరవ్‌మోదీ సోదరుడు అరెస్ట్



**వాషింగ్టన్, జూలై 5:** భారతీయ బ్యాంకులను రూ.వేల కోట్ల మేర మోసం చేసిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ సోదరుడు నేహల్ దీపక్ మోదీ అరెస్టయ్యారు. భారత ప్రభుత్వం చేసిన అప్పగింత అభ్యర్థన నేపథ్యంలో అమెరికాలో ఈ అరెస్టు చోటుచేసుకుంది.

రుణాల విషయంలో పంజాబ్ నేషనల్ బ్యాంకును మోసం చేసిన కేసులో నేహల్ మోదీ ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు చేసిన అభ్యర్థన మేరకు ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు జారీచేసింది. దాంతో గత వారం అమెరికా పోలీసులు నేహల్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనపై జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసులను రద్దు చేసేలా అతడు ప్రయత్నించినప్పటికీ.. ఫలితం లేకపోయింది. దాంతో తాజాగా అతడిని అరెస్టు చేశారు. అతడికి బెల్జియం పౌరసత్వం ఉంది.

నీరవ్ మోదీ పంజాబ్ నేషనల్ బ్యాంకులో రుణాలు తీసుకొని రూ.13,500 కోట్ల మేర మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. 2018లో భారత్ నుంచి ఆయన పరారీ అయ్యాడు. అప్పటి నుంచి భారత దర్యాప్తు సంస్థలు ఆయన కోసం వేట ప్రారంభించాయి. భారత్‌కు అప్పగింతకు సంబంధించి నీరవ్‌కు వ్యతిరేకంగా ఫలితం రావడంతో మార్చి 19, 2019న లండన్ అధికారులు అరెస్టు చేసి జైలులో ఉంచారు. దాదాపు ఆరేళ్లుగా అతడు జైళ్లోనే ఉంటున్నాడు. నీరవ్‌ను స్వదేశానికి తీసుకురావడం కోసం భారత ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటివరకు నీరవ్ మోదీ పదిసార్లు కోర్టులో బెయిల్ దరఖాస్తు చేశాడు. అన్ని సార్లు ఆయన భంగపాటుకు గురయ్యాడు.

ఇక నేహల్ అప్పగింతకు సంబంధించి జులై 17న విచారణ జరగనుంది. ఆ రోజున నేహల్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే వీలుంది. ఇక ఈ బ్యాంకు మోసం కేసులో నీరవ్ మామ మెహుల్ ఛోక్సీ పేరు కూడా ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఆర్థిక నేరగాడిని బెల్జియం పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అతడిని భారత్‌కు తీసుకురావడంపై ఏజెన్సీలు దృష్టిపెట్టాయి.

## ట్రంప్ సుంకాలకు మోదీ తలొగ్గుతారు.. రాసి పెట్టుకోండి

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



**ఢిల్లీ, జూలై 5:** మూడు నెలల క్రితం భారత్‌పై 26 శాతం సుంకాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. 90 రోజుల విరామం తర్వాత అది అమల్లోకి రాకుండా ఉండేందుకు వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని రాహుల్ పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలకు ప్రధాని మోదీ తలొగ్గుతారని.. తన మాటలు నమ్మకపోతే రాసిపెట్టుకోవాలని వ్యాఖ్యానించారు.

అమెరికా పరస్పర సుంకాల సస్పెన్షన్ జులై 9న ముగియనున్నందున, ఆ గడువుకు ముందే చర్చలు పూర్తి చేయాలని ఇరుదేశాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ పటిష్ఠ విధానాలను కలిగిఉందని స్పష్టం చేశారు. గడువు ఆధారంగా కీలకమైన వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసుకునేందుకు దేశం ఎప్పుడూ తొందరపడదని అన్నారు. రెండు వర్గాలకు లాభదాయకంగా ఉంటేనే అంగీకరిస్తుందన్నారు.

అమెరికాతో కుదుర్చుకోనున్న ఒప్పందంలో భాగంగా భారత్ కొన్ని కీలక రంగాల్లో సుంకాల నుంచి అగ్రరాజ్యాన్ని సడలింపు కోరుతోంది. ఇందులో టెక్స్‌టైల్స్, రత్నాలు, ఆభరణాలు, దుస్తులు, ప్లాస్టిక్స్, రసాయనాలు, రొయ్యలు, నూనె గింజలు, ద్రాక్ష, అరటిపండ్లు వంటివి ఉన్నాయి. మరోవైపు అమెరికా కొన్ని పారిశ్రామిక వస్తువులు, ఆటోమొబైల్స్ (ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు), వైన్స్, పెట్రో కెమికల్ ఉత్పత్తులు, పాడి ఉత్పత్తులు రంగాల్లో సుంకాల సడలింపు కోరుతోంది. అయితే ఈ సడలింపులను ఆమోదిస్తే, మన దేశంలో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నిత అంశమైనందున, వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపులకు భారత్ ససేమిరా అంటోంది. వాణిజ్య చర్చల నిమిత్తం ఇటీవల అమెరికా వెళ్లిన భారత బృందం తిరిగివచ్చింది. దీంతో అమెరికా-భారత్ మధ్య ఈనెల 9లోగా మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అప్పుడేమో 90 డిగ్రీల వంతెన

### ఇప్పుడు మెలికలు తిరిగిన వంతెన



**భోపాల్, జూలై 5:** మధ్యప్రదేశ్‌లోని భోపాల్లో ఇటీవల 90 డిగ్రీల మలుపుతో నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. అంతలోనే అక్కడికి దగ్గర్లోని సుభాష్‌నగర్‌లో నిర్మించిన పాములా మెలికలు తిరిగిన రైల్వే ఓవర్ బ్రిడ్జి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దాని నిర్మాణంలో ఇంజినీరింగ్ వైఫల్యం కారణంగా ఎనిమిది గంటల్లో రెండు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. రూ.40 కోట్లతో దీనిని నిర్మించినట్లు తెలుస్తోంది. భోపాల్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఈ వంతెన మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది.ఈ వంతెన వల్ల సుభాష్ నగర్ ప్రాంతంలో రద్దీ తగ్గినప్పటికీ దాని నిర్మాణం పలుచోట్ల మెలికలు తిరిగి ఉండడం వల్ల కొన్ని సెకన్లలోనే పలుమార్లు మలుపులు తీసుకోవాల్సి వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. దీనివల్ల రాత్రి సమయాల్లో, అధిక వేగంతో ప్రయాణించే వాహనదారులు మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి..ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన ఓ ప్రమాదంలో కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి గాలిలో పల్టీలు కొట్టిందని.. మరోసారి ఓ స్కూల్ వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టడంతో అందులోని విద్యార్థులకు గాయాలయ్యాయన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా వెంటనే తగిన చర్యలు తీసుకొని.. మరమ్మతులు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మరో 30-40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది

- బౌద్ధమత గురువు దలైలామా



**ధర్మశాల, జూలై 5:** టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని..ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులోభాగంగా టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30-40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ..తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రోంగ్ ట్రస్టుకు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..?అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. కాగా.. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.

## ఆయన ప్రజలను చంపుతూనే ఉంటారు

- పుతిన్ తీరుపై ట్రంప్ అసహనం



**వాషింగ్టన్, జూలై 5:** ఉక్రెయిన్‌పై రష్యాతో యుద్ధ విరమణ చేయించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నానాతంటాలు పడుతున్నారు. ఆ దిశగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో అసహనం వ్యక్తంచేస్తోన్న ఆయన.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై పరుష వ్యాఖ్యలు చేశారు. అలాగే మాస్కోపై మరిన్ని ఆంక్షలు ఉండొచ్చని బెదిరింపులకు పాల్పడ్డారు. 'ఆయన(పుతిన్)అంతే. మనుషులను చంపుతూనే ఉండాలని కోరుకుంటున్నారు. అది ఏమాత్రం మంచిదికాదు' అని మీడియా ఎదుట ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉక్రెయిన్ యుద్ధం తదితర అశాలపై పుతిన్-ట్రంప్ సుమారు గంటసేపు చర్చలు జరిపారు. ఇంత చేసినా వారు ఏ నిర్ణయానికి రాలేదు. ఈ విషయాన్ని స్వయంగా ట్రంప్ ఆ తర్వాత అంగీకరించారు. ఈ విషయంపై జర్నలిస్టులతో ఆయన చెబుతూనే.. 'మేము ఈ రోజు ఎటువంటి పురోగతి సాధించలేదు. ఫోన్‌కాల్లో సుదీర్ఘంగా మాట్లాడుకొన్నాం. ఇరాన్ విషయం సహా పలు అంశాలపై మాట్లాడుకొన్నాం. మీకు తెలుసు కదా ఉక్రెయిన్ అంశం చర్చకు వచ్చింది. ఆ విషయంలో నేను ఏమాత్రం సంతృప్తిగా లేను. ఏమాత్రం పురోగతి సాధించలేదు' అని ట్రంప్ నిరాశ వ్యక్తంచేశారు.

ఆ అంశంపై పుతిన్ సహాయకుడు యూరీ ఉషోవ్ మాట్లాడుతూ ఇరువురు నాయకులు సూటిగా చర్చించుకొన్నారు. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టాలని ట్రంప్ సూచించినా.. పుతిన్ మాత్రం తిరస్కరించారు. ఈ యుద్ధానికి కారణమైన అంశాల్లో రష్యా లక్ష్యాలను సాధించడానికి కట్టుబడి ఉన్నట్లు తేల్చిచెప్పారు. అదే సమయంలో దౌత్య మార్గంలో అంతిమంగా పరిష్కరించుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. యుద్ధ విరమణ కోసం ట్రంప్-పుతిన్ చర్చించుకోవడం ఇది ఆరోసారి. ఉక్రెయిన్‌పై కఠిన వైఖరితో వ్యవహరిస్తోన్న రష్యా.. అమెరికా అధ్యక్షుడితో సమావేశం ముగిసిన కొద్దిసేపటికే ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా 13 ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని భారీ దాడులు జరిపిన సంగతి తెలిసిందే.

## 20ఏళ్ల తర్వాత.. ఒకే వేదికపై ఠాక్రే సోదరులు



**ముంబయి, జూలై 5:** విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే , రాజ్ ఠాక్రేలు దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికను పంచుకున్నారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంతో ఇది ప్రతిపక్షాల విజయంగా పేర్కొంటూ.. నేడు ముంబయి వేదికగా 'వాయిస్ ఆఫ్ మరాఠీ' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే, మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన నేత రాజ్ ఠాక్రేలు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. ఛత్రపతి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత తిరిగి కలుసుకోవడం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారనుంది. ఈ కార్యక్రమంలో రాజ్ ఠాక్రే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోవడం ద్వారా మన పిల్లలు సరైన విషయాలు నేర్చుకొనే అవకాశం లేకుండా పోతోందని మోడీ ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. దక్షిణ భారతదేశంలో ఎందరో సినీనటులు, రాజకీయ నాయకులు ఇంగ్లీష్ మీడియంలో చదువుకున్నప్పటికీ తమ మాతృభాషలైన తెలుగు, తమిళం వంటి భాషల విషయంలో ఎంతో గర్వంగా ఉంటారన్నారు. అలాగే మహారాష్ట్ర నేతలకు, ప్రజలకు కూడా తమ భాషపై అభిమానం ఉంటుందని పేర్కొన్నారు. తమకు హిందీ భాషపై వ్యతిరేకత ఎప్పుడూ లేదని రాజ్ అన్నారు. అయితే ఇతరులపై ఆ భాషను బలవంతంగా రుద్దాలని చూస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ పూర్వీకులు మరాఠా సామ్రాజ్యాన్ని ఎన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ ఎప్పుడూ అక్కడి వారిపై మరాఠీని బలవంతంగా రుద్దలేదని రాజ్ పేర్కొన్నారు. కానీ కేంద్రప్రభుత్వం మాత్రం ఇతర రాష్ట్రాలపై త్రిభాషా సూత్రాన్ని ప్రయోగించాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికీ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు, ఇతర హైకోర్టులలో అన్ని ఉత్తర్వులు ఆంగ్లభాషలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని ఈ విధానాన్ని మహారాష్ట్రపై రుద్దాలని చూస్తే.. ఏం జరుగుతుందో ఇప్పటికైనా కేంద్రం తెలుసుకోవాలని హెచ్చరించారు. తమను ఒకచోట చేర్చడం ఎవరికీ సాధ్యం కాలేదని.. చివరికి బాల్ ఠాక్రే సైతం చేయలేకపోయిన పనిని.. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ రాష్ట్రానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం ద్వారా చేశారని రాజ్ ఠాక్రే అన్నారు. అనుకోకుండానే ఆయన తమని ఒకే వేదిక పైకి తీసుకువచ్చారని అన్నారు. ఇకపై రాష్ట్ర ఐక్యత విషయంలో తాము ఎప్పటికీ ఒక్కటిగా ఉంటామని పేర్కొన్నారు.

# అభివృద్ధి పాలన మాది అరాచక పాలన వారిది

- సుపరిపాలన తొలి అడుగు
- డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి



**బేతంచేర్ల, జూలై 5(మనం న్యూస్):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం లో భాగంగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి బేతంచేర్ల మండలంలో బుగ్గనపల్లె బుగ్గానిపల్లె తాండ సిమెంట్ నగర్ గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ బిజెపి నాయకులు బుగ్గానిపల్లె లో ముఖ్యమంత్రి అందిస్తున్న పథకాలను ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ వారికి తెలుపుతూ అర్హులైన వారికి పథకాలు పెన్షన్లు వస్తాయని గ్రామంలో ఉన్న సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పై అధికారులకు తెలిపి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు బుగ్గనపల్లి తండాలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు తల్లికి వందనం వారికి సూపర్ సిక్స్ పథకాలు వస్తాయని అన్నారు సిమెంట్ నగర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందిస్తూ ప్రభుత్వం ఇస్తున్న పథకాలను తెలిపారు గ్రామ ప్రజలు వారి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఇంటి నిర్మాణం కోసం అధికారులతో మాట్లాడి ఇంటి స్థలాలు ఏర్పాటు చేస్తామన్నారు నీటిసమస్య లేకుండా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామని తెలిపారు అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధానం బాగా లేకున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీల మేరకు ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా పెన్షన్లు తల్లికి వందనం ఉచిత సిలిండర్లు రైతు భరోసా అందిస్తున్నామని గతంలో ఒకరికే అమ్మబడి ఇచ్చేవారని ఇంట్లో ముగ్గురు ఉన్న ముగ్గురికి తల్లివందనం ఇస్తున్నామని అన్నారు ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్ లో హైటెక్ సిటీగా చేసి కొన్ని వేల మందికి ఉపాధి కల్పించారు అలాగే అమరావతిలో ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేస్తారని గత ప్రభుత్వం అరాచకాలు చేశారని ప్రజలు అందుకే వారికి తగిన బుద్ధి చెప్పారని నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి పాలన అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఏ సమస్య లేకుండా పరిష్కరించాలని కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సేవలు అందిస్తున్నామని ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ ఉన్నాం ఎల్ల నాగయ్య పోలూరు రాఘవరెడ్డి బుగ్గన ప్రసన్నలక్ష్మి బుగ్గన ప్రభాకర్ రెడ్డి భీమేశ్వర్ రెడ్డి పోలూరు శ్రీనివాసరెడ్డి ఉన్నాం చంద్రశేఖర్ రెడ్డి వర్ధన్ రెడ్డి ఎరుకల చెరువు శివ హుస్సేన్ రెడ్డి రామనాథం రవీంద్ర నాయక్ రామ్మూర్తి తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి

- పెంచిన విద్యుత్ సర్దుబాటు సర్దుబాటు చార్జీలను తగ్గించాలి!
- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి!!
- సిపిఐ ధర్నా
- వినతి పత్రం అందజేసిన సిపిఐ నాయకులు



**తుగ్గలి జులై 5(మనం న్యూస్ ):** కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి విద్యుత్ చార్జీల భారాలను మోపడం ప్రజలను దారుణంగా మోసగించడమేనని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ అన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించి,విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని శనివారం మండల కేంద్రమైన తుగ్గలి స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందని,అంతేకాక గృహ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తుందన్నారు.అదానీ తో జరిగిన విద్యుత్ ఒప్పందాలు రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు.గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని,స్మార్ట్ మీటర్లు ఏర్పాటురద్దు చేస్తామని,అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీలు ఇచ్చారన్నారు.కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన ఏడాది కాలంలో 4సార్లు విద్యుత్ చార్జీల బారాలను వినియోగదారులపై మోపారన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆదానితో చేసుకున్న ఒప్పందాల వల్ల రానున్న 25 ఏళ్ల పాటు దాదాపు ఒక లక్ష పదివేల కోట్ల రూపాయల ప్రజలపై భారం పడుతుందన్నారు.ఈ ఒప్పందాలపై కూటమి ప్రభుత్వం కనీసం సమీక్ష గాని,కనీసం నోరుమెదపడంగానీ లేదన్నారు.అనంతరం రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సంచాలకులకు సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

## ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**బేతంచేర్ల, జూలై 5(మనం న్యూస్):** పట్టణంలో ఉన్న ప్రభుత్వ వైద్యశాల ను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తనిఖీ చేశారు వైద్యశాలలో ఉన్న కాన్పు వార్డులో ఉన్న బాలింతలను సేవలను అడిగి తెలుసుకున్నారు ఆపరేషన్ థియేటర్ మౌలిక సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు వైద్య అధికారి సాగరిక విధులకు హాజరు కాకపోవడంతో హసనం వ్యక్తపరిచారు వైద్య సేవలు అందించాలని వైద్య అధికారి తప్పనిసరిగా ఉండాలని వైద్యశాలలో వచ్చిన రోగులకు పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా వైద్యాధికారికి తెలిపారు.

## స్మార్ట్ మీటర్లను తొలగించాలి



**ఆదోని, జూలై 05: (మనం న్యూస్):** రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించకపోతే, స్మార్ట్ మీటర్లను తొలగించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్రమైన ఉద్యమాలు చేపడతామని సిపిఐ నేతలు హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర పిలుపు మేరకు ఆదోనిలోని విద్యుత్ డిఈ కార్యాలయం వద్ద జిల్లా, మండల, పట్టణ నేతల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.సిపిఐ పట్టణ కార్యదర్శి టీ.వీరేష్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో, జిల్లా కార్యవర్గ సభ్యులు కే.అజయ్ బాబు, కల్లుబావి రాజు, సుదర్శన్, కార్మిక సంఘాల నేతలు కారన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ ప్రభుత్వం రైతులకు స్మార్ట్ మీటర్ల రూపంలో ఉరితాడ్లేసింది. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం ఏడాదిలోనే నాలుగు సార్లు చార్జీలను పెంచి ప్రజలను మోసగించింది అని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న సౌర విద్యుత్ ఒప్పందాల వల్ల రాష్ట్ర ప్రజలపై 25 ఏళ్లపాటు లక్ష పదివేల కోట్ల భారం పడుతుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించకపోతే సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు ఉంటాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు లక్ష్మీనారాయణ, రమేష్, శివరాముడు, బసాపురం గోపాల్, గంగన్న, సత్యనారాయణ, మదిరి ఎల్లప్ప, అంజిత్ గౌడ్, కొత్తూరు ఈరన్న, నాగరాజు, లింగప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచినీ వివరించండి



**తుగ్గలి జులై 5(మనం న్యూస్ ):** ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రజల సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని టీడీపీ మండల అధ్యక్షులు ఆర్. తిరుపాల్ నాయుడు పిలుపునిచ్చారు. శనివారం పెండేకల్ ఆర్ఎస్ లో పత్తికొండ శాసనసభ్యులు కే.యి శ్యామ్ కుమార్ ఆదేశాలు మేరకు క్లస్టర్ ఇంచార్జ్,యూనిట్ ఇన్చార్జులు,బూత్ ఇన్చార్జిలలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయడం ఒక భాగమైతే చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పడం మరో భాగమన్నారు.అధికారంలోకి వచ్చిన తర్వాత పెన్షన్లు పెంపు,తల్లికి వందనం,ఉచిత గ్యాస్ సిలిండర్లు,అన్నా క్యాంటీన్లు,తదితర సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు.త్వరలో అన్నదాత సుఖీభవ,మహిళలకు ఉచిత బస్సు,నిరుద్యోగ భృతి,మహిళలకు 1500,రాబోయే రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు.ఈ విషయాలన్నీ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ ఎద్దుల దొడ్డి శ్రీనివాసులు గౌడ్,మాజీ సర్పంచ్ మసాలా శీను,యూనిట్ ఇన్చార్జిలు రాంపల్లి మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు,చాంద్ బాషా, పగిడిరాయి రాము, బూత్ ఇన్చార్జులు పెండేకల్ మాజీ సర్పంచ్ బర్మా విరేష్,రజాక్, కోతి కొండ అయ్యన్న, రాతన మైరాముడు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలి

- స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి
- అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దుచేయాలి




**బేతంచేర్ల, జూలై 5 (మనంన్యూస్):** సీపీఐ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా బేతంచర్ల పట్టణంలోని పాత బస్టాండ్ నందు సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ పట్టణ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపింది. అంతేగాక గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి విద్యుత్ చార్జీల భారాలను మోపటం ప్రజలను దారుణంగా మోసగించడమే గతంలో చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ చార్జీల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని అవసరమైతే పగలగొట్టాలని సూచించారు ఆదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేస్తామని అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు కాని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన ఏడాది కాలంలో 4 సార్లు విద్యుత్ చార్జీల భారాలను వినియోగదారులపై మోపారు గృహ వినియోగాలకు సంబంధించి విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారు గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆదానీతో చేసుకున్న ఒప్పందాల వల్ల రానున్న 25ఏళ్ల పాటు దాదాపు ఒక లక్షా పదివేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుంది ఈ ఒప్పందాలపై కూటమి ప్రభుత్వం కనీసం సమీక్ష గాని కనీసం నోరు మెదపడంగానీ చేయడం లేదు ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని అదానీతో జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు ప్రజలపై విద్యుత్ పెనుభారాలను వ్యతిరేకిస్తూ ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్ దస్తగిరి ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ సీపీఐ నాయకులు ఏసన్న గోపాల్ మద్దిలేటి హర్ష రామదాస్ శంకర్ ధనుంజయ ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శులు ప్రదీప్ ఎల్లకృష్ణ భాస్కర్ మధు కార్తీక్ సాయి శివరాముడు రవి వినయ్ తదితరులు పాల్గొంటున్నారు

## కొత్త బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి



**జూపాడుబంగ్లా, జులై 5 (మనం న్యూస్):** జూపాడు బంగ్లా మండలంలోని నేషనల్ హైవే రోడ్డు పనులను సిపిఎం బృందం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరరావు పకీర్ సాహెబ్ ఎం కర్ణ గోపాలకృష్ణ శ్రీనివాసులు శనివారం రోజు పరిశీలించడం జరిగినది.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏం నాగేశ్వరరావు మాట్లాడుతూ నేషనల్ హైవే నందికొట్కూరు నుంచి దోర్నాల వైపు రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని బన్నూరు దగ్గర పాత బిడ్జిని తొలగించకుండా వాటిపైనే నిర్మాణం పనులు చేపట్టేందుకు కాంట్రాక్ట్ లాభాల కొరకు కొత్త బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టకుండా పాత బ్రిడ్జి వాహనాలు తిరగడానికి ఏర్పాటు చేయడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం తప్ప మరొకటి కాదన్నారు. రోడ్డు భవనాల శాఖ మంత్రి ఈ విషయంపై రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే గిత్త జయసూర్య మరియు స్థానిక అధికారులు వెంటనే స్పందించి పాత బ్రిడ్జిని తొలగించి కొత్త బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**దేవనకొండ, జులై 5( మనం ప్రతినిధి):** మండల కేంద్రమైన దేవనకొండలో మిత్ర నడిపి మాదన్న పశువుల వాము కాలిపోవడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసినట్లు జిల్లా వినియోగదారుల పరిష్కారం వేదిక సభ్యులు నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... నిరుపేద కుటుంబానికి చెందిన మాదన్నకు పశువుల మేత కాలిపోవడంతో మొదట విడత 30 వేలు, రెండవ విడత 10 వేలు, మొత్తం 40 వేల రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.రాజన్న, మాజీ ఉపసర్పంచ్ జి. సత్యరాజు అలాగే గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జూలై 9 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



**పత్తికొండ జులై 5(మనం న్యూస్ ):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై తీసుకున్న వ్యతిరేక విధానాలపై జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పత్తికొండ పట్టణంలోని స్థానిక మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వరెడ్డి భవనం నందు సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జులై 9 న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి డి. గోపాల్, పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులువెంకటేశ్వర్ రెడ్డి, దస్తగిరి, ఎం. రవిచంద్ర, పాల్గొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని వీటి రద్దు కోసం జరిగే దేశవ్యాప్త సమ్మెలో సిఐటియు ప్రజాసంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు. ప్రజానాట్యమండలి నాయకులు రమేష్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్, కాసిం, జయ, డివైఎఫ్ఐ నాయకులు డి. అలిపిర, , భవన నిర్మాణ సంఘం నాయకులు దుర్గ, , మంజు, వివో ఏ సంఘం నాయకులు బ్రహ్మయ్య, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం,అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు



**తుగ్గలి జులై 5(మనం న్యూస్ ):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో పాటు,అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు.శనివారం 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడుతో పాటు స్థానిక నేతలు మాజీ సర్పంచ్ మసాలా శీను,టిడిపి మైనార్టీ సెల్ జిల్లా నాయకులు చాంద్ బాషా, నాయకులు,కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు.సందర్భంగా వారు మాట్లాడుతూ విధ్వంసం పాలన నుండి కూటమి ప్రభుత్వం వచ్చాక వికాసం వైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పయనిస్తుందన్నారు.సంక్షేమం, అభివృద్ధి సమ్మర్ధవంతంగా తీసుకువెళ్లి రాష్ట్ర అభివృద్ధిని చేయగలిగే నాయకుడు సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెండెకల్ మాజీ సర్పంచ్ బర్మా విరేష్,ఎద్దులదొడ్డి శ్రీనివాసులు గౌడ్, రాంపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు,చాంద్ బాషా,మైరామడు,నారాయణ,రాజా,మహేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత పాటిస్తేనే.. ప్రాణ రక్షణ



**ఆదోని, జులై 05: (మనం న్యూస్) :** కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ఆదోని డీఎస్పీ హేమలత, పర్యవేక్షణలో ట్రాఫిక్ సీఐ గంట సుబ్బారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కన శ్రీ అభయ ఆంజనేయస్వామి గుడి వద్ద రోడ్డు భద్రత - ప్రమాదాల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులకు వాహనాన్ని నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాహనానికి సంబంధిత రికార్డులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్.సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్) తప్పనిసరిగా కలిగి ఉండాలి అని వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్ డ్రైవర్లు సీటు బెల్టు ధరించడం అత్యవసరం అని గుర్తు చేశారు. రోడ్ రూల్స్ పాటించటం వల్ల ప్రమాదాలు నివారించి ప్రాణాలను రక్షించవచ్చని సూచించారు. ఇటీవల పెరిగిన ట్రాఫిక్ జరిమానాల వివరాలను కూడా వాహనదారులకు తెలియజేశారు.

## టీడీపీ సీనియర్ కార్యకర్త భౌతికకాయనిక నివాళి



**మంత్రాలయం , జూలై 5 (మనం న్యూస్):** మంత్రాలయం మండలం చెట్నిహళ్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పద్మశాలి దేవగట్టు ఈరన్న అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రాలయం తెదేపా బాధ్యుడు ఎన్ రాఘవేంద్ర రెడ్డి గ్రామ వెళ్ళి ఈరన్న భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ మాధవరం రామి రెడ్డి కుటుంబం , తెలుగుదేశం పార్టీ మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెబుతూ భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం మాజీ జెడ్పిటిసి ఆర్.లక్ష్మయ్య, మాలపల్లి లక్ష్మన్న గ్రామ నాయకులు చాపల నాగేష్ మేకల మల్లేష్ లక్ష్మయ్య వీరేష్ గోపాల్ నాగరాజు తిమ్మరాజు పరమేష్ మరియు టిడిపి గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుడికంబలిలో తొలి- అడుగు కార్యక్రమం



**కౌతాళం, జూలై 5 (మనం న్యూస్):** మంత్రాలయం తెదేపా సీనియర్ నాయకులు చూడి ఉలిగయ్య క్లస్టర్ మరియు యూనిట్ ఇంచార్జీలు అడివప్ప గౌడ్, నాగేశ్వరరావు శనివారం కౌతాళం మండలం నందు గుడికంబాలి గ్రామం నందు కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సుపరిపాలనలో తొలి - అడుగు కార్యక్రమంలో పాల్గొని ఏడాదిలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని ప్రజలను అడిగి తెలుసుకుంటూ, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటూ,కూటమి ప్రభుత్వం నందు అన్ని సామాజిక ప్రజలు నందు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని, ఏడాదిలోనే 70% హామీలు పూర్తి చేశామని రాబోయే 4 ఏళ్లలో మరింతగా ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రతి ఒక్కరు కలలు కన్న 2047 స్వర్ణాంధ్ర మిషన్ సహకారం చేసుకుందాం అని తెలియజేశారు.మరియు మనది వెనుక బడిన పశ్చిమ తీరం కావున మనకు పూర్తిగా సహకారం అందిస్తున్నారని ఎన్.రాఘవేంద్ర రెడ్డి సహకారంతో మాత్రలయాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుందాం అని తెలియజేశారు.ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు మల్లప్ప గౌడ్, వీరుపాక్షి మాజీ సర్పంచ్ గోపాల్,మహాలక్ష్మీ రేనప్ప,బిజెపి శ్రీనివాసులు,వెంకటేష్, గుడిసిలి గోపా

## తిక్కరెడ్డిని కలిసిన తోట రామకృష్ణ



**కౌతాళం, జూలై 5(మనం న్యూస్):** ఎన్డీఏ కూటమి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు ఎన్డీఏ కూటమిలో భాగంగా జిల్లాలో బిజెపి పార్టీకి రావలసినవన్నీ కూడా ఇవ్వాలి అని కోరుతూ టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కరెడ్డిని కలిసిన బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ శనివారం రోజున టిడిపి కర్నూల్ జిల్లా అధ్యక్షులు తిక్కరెడ్డిని ఎమ్మిగనూరులోని ఆయన నివాసంలో బిజెపి కర్నూలు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ కలిసి కర్నూలు జిల్లాలోని పాణ్యం మరియు కర్నూల్, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, ఆలూరు,పత్తికొండ 8 నియోజకవర్గాలకు సంబంధించిన కో-ఆపరేటివ్ సొసైటీల చైర్మన్స్ ను మరియు మెంబర్స్ ను మరియు దేవాలయ ఎండోమెంట్ చైర్మన్స్ మరియు మెంబర్స్ ను డీలర్స్,ఫీల్ అసిస్టెంట్స్, వెలుగు బుక్ కీపర్స్,స్కూల్స్ లో మధ్యాహ్నం భోజనం వంట వండుటకు ఇవన్నీ కూడా జిల్లా మొత్తం మీద కేటాయించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కరెడ్డికి లెటర్ ప్యాడ్ ద్వారా విషయం తెలపడం జరిగింది. ఆయన కూడా సానుకూలంగా స్పందిస్తూ మీరు ఇచ్చిన ఈ లెటర్ ప్యాడ్స్ ను స్టేట్ పార్టీకి పంపిస్తానని మీకు రావాల్సినవన్నీ త్వరలోనే అమలు చేస్తామని తెలపడం జరిగింది.

## తుంగభద్ర నదికి చేరిన వరద నీరు



**మంత్రాలయం, జూలై 5,(మనం న్యూస్) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయంలో తుంగభద్ర నదికి జల కళ సంతరించుకుంది. శనివారం మంత్రాలయంలో తుంగభద్ర నది నిండకుండలా ప్రవహిస్తోంది. కర్నాటక రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగా హొస్పేట్ లోని తుంగభద్ర (టీబీ డ్యాం) కు భారీ ఎత్తున నీరు చేరుకుంది. డ్యాం నుంచి దాదాపు 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా తుంగభద్ర నదిలో నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి సమీపంలో తుంగభద్ర నది ఉధృతంగా ప్రవహించడంతో భక్తాదులు, గ్రామ ప్రజలలు నదిలోకి వెళ్లరాదని సూచించారు.మంత్రాలయం మండల పరిధిలోని నదీపరివాహక ప్రాంతాలైన మాధవరం, రాంపురం, కాచాపురం, చెట్నీహళ్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. మంత్రాలయంలో ముందస్తు చర్యల్లో భాగంగా నదిలోకి ఎవరూ వెళ్లకుండా శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు చేస్తున్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి.. 12మంది అరెస్ట్



**తుగ్గలి, జులై 5(మనం న్యూస్ ):** పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు.తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో శనివారం ఉదయం చెరువు కట్ట కింద కంపచెట్లలో జొన్నగిరి గ్రామానికి చెందిన నారాయణస్వామి, శ్రీనివాస్ రెడ్డి తో పాటు మరో 10మందిని పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకొని వారి దగ్గర నుండి రూ.5300నగదు స్వాధీనం చేసుకొని అందరిపై కేసు నమోదు చేసినట్లు జొన్నగిరి సబ్ ఇన్స్పెక్టర్ యన్ సి. మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా జొన్నగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో పేకాట,మట్కా గానీ ఆడినట్లయితే జొన్నగిరి పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని,సమాచారం ఇచ్చినటువంటి వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచబడుతుందని ప్రజలకు ఎస్సై మల్లికార్జున తెలిపారు.

# ‘మేం టికెట్ కొనిస్తాం.. భారత్‌కు పంపించేయండి’

## ప్రసిద్ధ్‌పై నెట్టింట విమర్శలు



ఇంగ్లాండ్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ ఒక్క వికెట్ తీయలేకపోయాడు. 13 ఓవర్లు వేసిన ప్రసిద్ధ్ 72 పరుగులు ఇచ్చాడు. షార్ట్ పిచ్ బంతులతో ప్రత్యర్థి బ్యాటర్లకు పరీక్ష పెడదామని భావించిన టీమ్‌ఇండియా వ్యూహం ఫలించలేదు. ఇంగ్లాండ్ బ్యాటర్ జేమీ స్మిత్ ఎదురు దాడికి దిగాడు. అతడు భారీ శతకం చేయడానికి ఓ రకంగా ప్రసిద్ధ్ బౌలింగ్ కారణమని సోషల్ మీడియా వేదికగా కామెంట్లు వస్తున్నాయి. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ప్రసిద్ధ్ ఐదు వికెట్లు తీసినా ఆరు రన్‌రేట్‌తో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 220 పరుగులు సమర్పించాడు. దీంతో లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇవ్వకుండా ప్రసిద్ధ్‌ను ఆడించడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. అందులో కొన్ని కామెంట్లు ఇవీ.. ‘‘ఇలా అంటున్నందుకు క్షమించాలి.. 35 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ కూడా చాలా అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. ప్రసిద్ధ్ కంటే ఇంగ్లిష్ పిచ్‌లపై భువీ ఇంకా బాగా వేయగలడేమో’’ ‘‘అర్ష్‌దీప్ సింగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో కూర్చొని ఉన్నాడు. ప్రసిద్ధ్ కృష్ణ మాత్రం వరుసగా టెస్టులు ఆడేస్తున్నాడు. ఓవర్‌లో ఆరు బంతులు బౌండరీలు పోతున్నాయి. ఇలాంటి సెలక్షన్ చూస్తుంటే వింతగా అనిపిస్తోంది’’‘‘సాధారణంగా విరాట్ కోహ్లీని రన్ మెషీన్ అంటారు. ఇక్కడ ఇంగ్లాండ్‌కు ప్రసిద్ధ్ రన్ మెషీన్‌లా మారినట్లుంది. ప్రసిద్ధ్ భారత వెర్షన్ హారిస్ రవూఫ్’’‘‘ప్రసిద్ధ్ కృష్ణను వెంటనే భారత్‌కు పంపించండి. కావాలంటే నేను బిజినెస్ క్లాస్ టికెట్‌ను స్పాన్సర్ చేస్తా.

## శుభ్‌మన్ గిల్ సెంచరీ.. భారీ ఆధిక్యంలో టీమ్‌ఇండియా..

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో టీమ్‌ఇండియా పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో టీ విరామ సమయానికి భారత్ 4 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్ సెంచరీ (269) చేసిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (100లిబీ 130 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) రెండో ఇన్నింగ్స్‌లో శతకం బాదాడు. దూకుడుగా ఆడిన రిషభ్ పంత్ (65బీ 58 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకం చేసి పెవిలియన్ చేరాడు. గిల్‌కుతోడుగా రవీంద్ర జడేజా (25లి) క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం భారత్ ఆధిక్యం 484.



తాజా సెంచరీతో గిల్ పలు రికార్డులు నెలకొల్పాడు. సునీల్ గావస్కర్ (వెస్టిండీస్‌పై 1971) తర్వాత ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన రెండో భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన తొమ్మిదో బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. అంతేకాకుండా గావస్కర్ (344)ను అధిగమించి ఒకే మ్యాచ్‌లో అత్యధిక రన్స్ చేసిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు.విరాట్ కోహ్లీ తర్వాత కెప్టెన్‌గా తన మొదటి రెండు టెస్టుల్లో మూడు సెంచరీలు చేసిన రెండో ఆటగాడిగా నిలిచాడు.

# ఆ రూ.15,000 కోట్ల ఆస్తి నీకు రాదు

## అది ఎనిమీ ప్రాపర్టీయే అన్న హైకోర్టు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఆయన కుటుంబానికి చెందిన రూ.15,000 కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటుంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తాత)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటుంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు.



# అనుష్క సినిమా మళ్ళీ వాయిదా!

మన టాలీవుడ్ స్టార్ హీరోయిన్ స్వీటీ అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న అవైటెడ్ చిత్రమే ‘‘ఘాటీ’’. విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన ఈ సినిమా కోసం అభిమానులు ఎప్పుడు నుంచో ఎదురు చూస్తున్నారు. అయితే ఇది వరకే పలు డేట్స్ ని ఫిక్స్ చేసుకున్న ఈ సినిమా ఈ జూలై 11న విడుదల కావాల్సి ఉంది. కానీ ఇక్కడ కూడా అనుమానమే అంటూ పలు రూమర్స్ రీసెంట్ గానే వచ్చాయి. ఇక అనుకున్నట్టే ఇప్పుడు జరిగింది.

సినిమా మళ్ళీ వాయిదా వేస్తున్నట్టుగా మేకర్స్ అధికారిక క్లారిటీ అందించారు. ఒక అధికారిక ప్రెస్ నోట్ తో ఘాటీ సినిమా తమకి ఒక ఎమోషన్ అని ఈ సినిమా నుంచి ప్రతీ చిన్న విషయం అంతా చిరకాలం గుర్తుండేలానే డిజైన్ చేస్తున్నామని అలాగే కొత్త డేట్ ని త్వరలోనే అనౌన్స్ చేస్తామని కన్ఫర్మ్ చేశారు. అయితే సినిమా వి ఎఫ్ ఎక్స్ పనులు ఇంకా పూర్తి కాకపోవడం వల్లే ఈ వాయిదా అన్నట్టు తెలుస్తుంది. మరి కొత్త ఎప్పుడు అనేది వేచి చూడాలి. ఈ సినిమాని యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# మరో ఆఫర్ పట్టేసిన పూజా హెగ్డే!

టాలీవుడ్ లో కొన్నాళ్ల కితం వరుస బ్లాక్ బస్టర్ హిట్స్ తో అదరగొట్టిన స్టార్ హీరోయిన్స్ లో పూజా హెగ్డే కూడా ఒకరు. మరి పూజా హెగ్డే హీరోయిన్ గా మళ్ళీ కొంత కాలం తర్వాత సిల్వర్ స్క్రీన్ పై బిజీగా మారింది. అయితే ఎక్కువగా తమిళ్ లోనే సినిమాలు చేస్తున్న పూజా హెగ్డే రీసెంట్ గానే ‘రెట్రో’ సినిమాలో సూర్య సరసన కనిపించింది. ఇక ఇవి కాకుండా తమిళ్ లోనే కూలీ, ఇంకా జన నాయగన్ లాంటి భారీ సినిమాల్లో కూడా ఆమె నటించిన సంగతి తెలిసిందే. మరి ఈ ప్రాజెక్ట్ లు కాకుండా మరో సాలిడ్ ప్రాజెక్ట్ ని ఆమె పట్టేసినట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. దీని ప్రకారం పూజా హెగ్డే నెక్స్ట్ హీరో ధనుష్ సరసన కనిపించనున్నట్టుగా తెలుస్తుంది. ధనుష్ లేటెస్ట్ గా కుబేర తో హిట్ కొట్టాడు అలాగే తన హిందీ సినిమా ఒకటి పూర్తి చేసుకున్నాడు. మరి ఫైనల్ గా తన నెక్స్ట్ సినిమా కోసం కూడా సిద్ధం అవుతుండగా అందులో పూజా నటించనున్నట్టు ఇపుడు తెలుస్తుంది. ఇక దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.



# వైరల్ వయ్యారి



‘‘ఇన్‌స్టాగ్రామ్‌లో నా ఫాలోయింగు.. చూశావంటే మైండ్ బ్లోయింగు.. ఫాలోవర్స్ అందరికీ నేనే డార్లింగు.. నేనేమి చేసినా ఫుల్లు ట్రెండింగు’’ అంటూ కిరీటి రెడ్డితో కలిసి హుషారుగా చిందేస్తోంది శ్రీలీల. ఇప్పుడీ ఇద్దరూ జంటగా నటించిన చిత్రం ‘జూనియర్’. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమాని రజనీ కొర్రపాటి నిర్మించారు. జెనీలియా కీలక పాత్ర పోషించింది. ఈ సినిమా ఈ నెల 18న తెలుగు, కన్నడ, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఈ చిత్ర రెండో గీతాన్ని బయటకు వదిలారు. ‘‘వైరల్ వయ్యారినీ.. నే వయసొచ్చిన అణుబాంబుని’’ అంటూ హుషారుగా సాగిన ఈ మాస్ పాటకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతమందించడమే కాక హరిప్రియతో కలిసి స్వయంగా ఆలపించారు. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యమందించారు. రేవంత్ గొల్లమండల నృత్యరీతులు అందించారు. ఈ పాటలో కిరీటి, శ్రీలీల కెమిస్ట్రీ.. వాళ్లిద్దరూ వేసిన స్టెప్పులు ఆకర్షణగా నిలిచాయి. ప్రేమ, యాక్షన్, స్నేహం అంశాలతో ముడిపడిన ఈ యూత్ ఎంటర్‌టైనర్‌కు కె.కె.సెంథిల్ కుమార్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు. పీటర్ హెయిన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు.

# నిధి అన్వేషణ మళ్లీ మొదలు



కథానాయకుడు నాగచైతన్య.. దర్శకుడు కార్తీక్ దండు కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మీనాక్షి చౌదరి కథానాయిక. బాపినీడు సమర్పిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా రెండో షెడ్యూల్‌ను ప్రారంభించుకున్నట్లు చిత్ర బందం శుక్రవారం ప్రకటించింది. హైదరాబాద్‌లో మొదలైన ఈ షెడ్యూల్ మూడు వేర్వేరు ప్రాంతాల్లో చిత్రీకరణ చేసుకోనుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో భాగంగా చైతన్యపై కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఇది నిధి అన్వేషణతో ముడిపడి ఉన్న ఆసక్తికర కథతో రూపొందుతున్న సినిమా. చైతూ ఇందులో అర్జున్ అనే ట్రెజర్ హంటర్‌గా సాహసాలు చేయనున్నారు. ఈ చిత్రానికి శ్రీనాగేంద్ర తంగల ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు.

# చకచకా ‘స్పిరిట్’ సన్నాహాలు



కథానాయకుడు ప్రభాస్ ‘ది రాజాసాబ్’ను ముగించే పనిలో ఉన్నారు. అలాగే ప్రభాస్‌తో హను రాఘవపూడి చేస్తోన్న చిత్రాన్ని చకచకా పరుగులు పెట్టిస్తున్నారు. ఇక ఇప్పుడు మరోవైపు ‘స్పిరిట్’ను పట్టాలెక్కించేందుకు జోరుగా సన్నాహాలు చేసుకుంటున్నారు. ‘యానిమల్’ విజయం తర్వాత సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమాని సెప్టెంబరు నుంచి సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే దీని కోసం ప్రభాస్ బల్క్ డేట్స్ కేటాయించినట్లు సమాచారం ప్రస్తుతం దీనికి తగ్గట్లుగానే పూర్వ నిర్మాణ పనుల్ని వేగవంతం చేసినట్లు తెలిసింది. హైఓల్టేజ్ కాప్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో ప్రభాస్ శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. దీన్ని తొమ్మిది భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.